


వార్తాప్రభ
RNI No. APTEL/2004/12176
epaper : https://varthaprabha.com
సమగ్ర వార్తా దినపత్రిక
Circulated Telangana & Andhra Pradesh States

## ఏపీలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదుకు ఈసీ ప్రకటన

తూర్పు- పశ్చిమ గోదావరి జిల్లా ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి తాజా ఓటర్ల జాబితా రూపకల్పనకు ఎన్నికల సంఘం ప్రకటన జారీ

**అమరావతి,జూలై 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఈసీ ఆదేశాలమేరకు 2024 నవంబరు 1 నాటికి జాబితా రూపోందించేలా షెడ్యూలు విడుదల చేయాలని నిర్ణయించినట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్ యాదవ్ తెలిపారు. ఈ నెల 29న ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి ఓటర్ల రిజిస్ట్రేషన్‌కు ఈసీ.. నోటీసు విడుదల చేయనుంది.శ్రీకాకుళం-విజయనగరం-విశాఖ ఉపాధ్యాయ నియోజకవర్గానికి, కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఓటర్ల జాబితాలో పేర్ల నమోదుకు 2024 సెప్టెంబరు 30న ఎన్నికల సంఘం నోటీసు జారీ చేయనుంది.

సంపుటి : 23 | సంచిక : 131 | ది. 28-07-2024 | విజయవాడ | ఆదివారం | పేజీలు : 8 | వెల : రూ. 1/-

# కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి రూ.50,474 కోట్లు - కేంద్ర మంత్రి మురుగన్



**విజయవాడ జూలై 27 :(వార్తా ప్రభ ప్రతినిధి):** కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, ముఖ్యంగా రాజధాని అమరావతికి ప్రాధాన్యత ఇచ్చినట్లు కేంద్ర సమాచారశాఖ సహాయమంత్రి మురుగన్ తెలిపారు. రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి 2040 లక్ష్యంగా బడ్జెట్ కేటాయించామన్నారు. ఆయా ప్రాంతాల్లో 8.2 శాతం ఆర్థిక అభివృద్ధిని లక్ష్యంగా నిర్దేశించామన్నారు. కేంద్ర బడ్జెట్ అనంతరం మేధావులు, వివిధ వర్గాల ప్రతినిధులతో సమావేశమయ్యేందుకు విజయవాడ వచ్చిన కేంద్ర మంత్రి మురుగన్ మీడియా సమావేశం నిర్వహించారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల నిబంధనలను సరళతరం చేయడంతోపాటు ఎంఎస్‌ఎంఈలను బలోపేతం చేసే దిశగా బడ్జెట్‌లో తగిన ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. తాజా బడ్జెట్‌లో ఏపీ అభివృద్ధికి రూ.50,474 కోట్లు కేటాయించారన్నారు. పోలవరం ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేసేందుకు కేంద్రం కట్టుబడి ఉందన్నారు. విశాఖ - చెన్నై, హైదరాబాద్- బెంగుళూరు పారిశ్రామిక కారిడార్‌లకు బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చామని, ప్రతిష్ఠాత్మక పూర్వోదయ పథకాన్ని తీసుకొచ్చామని తెలిపారు. దీనివల్ల ఝూర?ండ్ నుంచి ఆంధ్రప్రదేశ్ వరకు ఉన్న తూర్పుతీర ప్రాంతాన్ని దేశానికి గ్రోత్‌ఇంజిన్‌గా మారుస్తామన్నారు. ఏపీలోని రాయలసీమ, ఉత్తరాంధ్రతోపాటు ప్రకాశం జిల్లాను కూడా వెనుకబడిన ప్రాంతంగా గుర్తించి.. ఆయా ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామన్నారు. దేశంలో రొయ్యల ఎగుమతిలో 60శాతం ఆంధ్రప్రదేశ్ నుంచే ఉందని, బ్రీడింగ్ సెంటర్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. వ్యవసాయంలో విభిన్న పంటల పెంపకం కోసం పరిశోధనలు చేసేందుకు వీలుగా నిధులు కేటాయిస్తామన్నారు.

## బతుకమ్మ చీరలు, గొర్రెల పంపిణీపై విచారణకు సిద్ధమా?- సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, జూలై 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)** భారాస ప్రభుత్వ హయాంలో గొర్రెల పంపిణీ పథకంలో రూ.700 కోట్ల అవినీతి జరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. "అప్పుల లెక్కలు చెప్పిన హరీశ్‌రావు అమ్మకాల లెక్కలు చెప్పట్లేదు. ప్రజలు శిక్షించినా వాళ్ల ఆలోచన మారలేదు. భారాస హయాంలో రూ.లక్షల కోట్ల విలువైన ఓఆర్‌ఆర్‌ను రూ.7 వేల కోట్లకు అమ్మారు. పదేళ్లలో పాలమూరు జిల్లా ప్రాజెక్టులు పూర్తి చేయలేదు. కేసీఆర్ పాలనలో రంగారెడ్డి జిల్లాలో భూములు అమ్ముకున్నారు. కానీ జిల్లాకు సాగునీరు ఇవ్వలేదు. ఈ ప్రాంతాన్ని ఎడారిగా మార్చారు. బతుకమ్మ చీరలు అని చెప్పి సూరత్ నుంచి కిలోల లెక్క తీసుకువచ్చి పంపిణీ చేశారు. బతుకమ్మ చీరలు, గొర్రెల పంపిణీపై విచారణకు సిద్ధంగా ఉన్నారా? సభ్యులు మాట్లాడే తప్పును సరిచేసే బాధ్యత నాకుంది. సభలో అబద్ధాలు మాట్లాడటం సరైన పద్ధతి కాదు. 2018 డిసెంబర్ లోపే విద్యుత్ మీటర్లు బిగిస్తామని కేంద్రానికి కేసీఆర్ చెప్పారు. అధికారిక లెక్కలు చూసి హరీశ్‌రావు స్పందించాలని రేవంత్‌రెడ్డి తెలిపారు.

# కేసీఆర్ బాటలోనే రేవంత్ రెడ్డి నడుస్తున్నారు - బండి సంజయ్

- బ్రోకర్లకు కమీషన్లు ఇచ్చి కాంగ్రెస్ అప్పులు తెచ్చే కుట్రలు
- కేంద్రమంత్రి బండి సంజయ్

**హైదరాబాద్, జూలై 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేసీఆర్ బాటలోనే నడుస్తున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శించారు. బ్రోకర్లకు కమీషన్లు ఇచ్చి మర్చంట్ బ్యాంకర్స్ ద్వారా అధిక వడ్డీలకు వేలాది కోట్ల రూపాయల అప్పులు తెచ్చే కుట్రలకు కాంగ్రెస్ ప్రభుత్వం తెరలేపిందని విమర్శించారు. దీంతో రాష్ట్ర ప్రజలపై మోయలేని భారం పడుతుందన్నారు. ఈ అంశంపై అసెంబ్లీలో చర్చ జరగాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ బడ్జెట్, కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అన్నీ గాడిద గుడ్డే అన్నారు. 64 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, 8 మంది ఎంపీలూ గాడిద గుడ్డే అన్నారు. నీతి అయోగ్ సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరుకాకపోవడం దుర్మార్గమన్నారు. భారత్‌ను నెంబర్ వన్‌గా తీర్చిదిద్దడం, కేంద్ర రాష్ట్ర సంబంధాల బలోపేతమే లక్ష్యంగా నీతి అయోగ్ సమావేశం జరుగుతుందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు అవకాశవాద పార్టీలు అని విమర్శించారు. అవకాశం వస్తే కాంగ్రెస్ పార్టీలో బీఆర్ఎస్ విలీనం అవడం ఖాయమని జోస్యం చెప్పారు.



కాళేశ్వరంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి డ్రామాలు ఆడుతున్నాయన్నారు.

# ప్రజాఫిర్యాదులకు ప్రత్యేక ప్రాధాన్యత

- కార్పొరేషన్ కమిషనర్ భావన ఆదేశం



**కాకినాడ జూలై 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, డయల్ యువర్ కమిషనర్ ద్వారా వచ్చిన ప్రతీ ఒక్క ఫిర్యాదుకు నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని కాకినాడ నగరపాలకసంస్థ కమిషనర్ భావన అధికారులను ఆదేశించారు. ప్రజాఫిర్యాదుల పరిష్కార ప్రగతిపై శనివారం అన్ని విభాగాధిపతులతో కమిషనర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు వచ్చిన ఫిర్యాదులు ఎన్ని? ఎన్ని పరిష్కారమయ్యాయి? ఇంకా ఎన్ని పరిష్కారించాల్సి వుంది? పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు కారణాలు ఏమిటీ వంటి అంశాలపై ఆరా తీశారు. ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమంగా ఉన్న ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడంలో అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.ముఖ్యంగా ఆయా విభాగాధిపతులు వచ్చిన ఫిర్యాదులను స్వయంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ సీహెచ్.నాగనరసింహారావు, ఎస్ఈ పి.సత్య కుమారి, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్,స్మార్టు సిటీ ఎస్ఈ వెంకటరావు,ఎంహెచ్‌వో డా.పృధ్వీ చరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ,ఏసీపీ నాగశాస్త్రులు,ఉద్యాన సహాయసంచాలకులు టీవీ శిరిల్, ఈఈ మాధవి,ఇతర విభాగాధిపతులు పాల్గొన్నారు.

## ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు అర్జీల పరిష్కారంలో ఉప ముఖ్యమంత్రి

- వెంకటగిరిలో మహిళలను, వృద్ధులను వేధిస్తున్న ముఠాలపై వచ్చిన ఫిర్యాదుకు స్పందించి తిరుపతి ఎస్పీతో ఫోన్లో మాట్లాడిన పవన్ కళ్యాణ్
- గంటల వ్యవధిలో స్పందించిన పోలీసు యంత్రాంగం... కేసులు నమోదు చేసి బైండోవర్



**గుంటూరు :జూలై 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన కార్యాలయానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి వచ్చిన అర్జీలను, ఫిర్యాదులను శనివారం ఉదయం నుంచీ పరిశీలిస్తున్నారు. తన కార్యాలయ సిబ్బందితో కలసి ఉప ముఖ్యమంత్రి స్వయంగా ప్రతి అర్జీని క్షుణ్ణంగా చదువుతున్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, పర్యావరణం, అటవీ శాఖలపై వచ్చిన అర్జీలతోపాటు ప్రజలు తాము ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను, ఎదురవుతున్న ఇబ్బందులను ఫిర్యాదుల రూపంలో పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువచ్చారు. తన శాఖల పరిధిలోని ప్రతి అంశాన్నీ అధికారులతో మాట్లాడి నిర్దేశిత వ్యవధిలో పరిష్కరించాలని ఆదేశాలు ఇచ్చారు. ఇతర శాఖలకు సంబంధించిన అర్జీలు, ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపిస్తున్నారు. తిరుపతి జిల్లా వెంకటగిరిలోని ఎన్టీఆర్ కాలనీ, 6వ వార్డు, ఫస్ట్ లేన్ నుంచి మహిళలు, వృద్ధులు తెలియచేసిన సమస్య పవన్ కళ్యాణ్ ని కదిలించింది. ముఠాలుగా ఏర్పడిన కొందరు యువకులు బైక్స్ పై ప్రమాదకరంగా, వేగంగా వీధుల్లో సంచరిస్తూ విద్యార్థినులను, యువతులను, మహిళలను వేధిస్తున్నారని... వృద్ధులను భయపెడుతున్నారని లేఖ రాశారు. అదే విధంగా యువతుల ఫోటోలు తీసి ఇంటర్నెట్లో ఉంచి.. బ్లాక్ మెయిల్ చేస్తున్నారని, మద్యం తాగి ఇళ్ల ముందు భారీ శబ్దాలు చేస్తూ పాటలుపెట్టడం, ఇళ్లపై రాళ్ళు వేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వాపోయారు.. ఆడ పిల్లలను, మహిళలను వేధించేవారిపై కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ సమస్యపై వెంటనే దృష్టి సారిస్తామని తగు చర్యలు తీసుకొంటామని తిరుపతి ఎస్పీ తెలిపారు. **పోలీసుల తక్షణ స్పందన** పవన్ కళ్యాణ్ తెలిపిన అంశంపై తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు స్పందించి సంబంధిత డివిజన్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. వెంకటగిరి ఎన్టీఆర్ కాలనీకి వెళ్ళి అక్కడి ప్రజలతో మాట్లాడి... వారిని వేధిస్తూ ఇబ్బందిపెడుతున్న వారి వివరాలు నమోదు చేసుకున్నారు. బైక్స్ పై మితిమీరిన వేగంతో ప్రమాదకరంగా సంచరిస్తూ వేధిస్తున్నవారిని పట్టుకొని కేసులు నమోదు చేసి బైండోవర్ చేశారు.

# హైదరాబాద్ అభివృద్ధికి మా ప్రభుత్వం 10 వేల కోట్లు కేటాయించింది..

- కేంద్రం నుండి హైదారాబాద్ కి ఏం తెస్తారో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పాలి..
- తెలంగాణ పై కేంద్రం వివక్షాపూరితంగా వ్యవహరిస్తుంది..
- బండి సంజయ్, కిషన్ రెడ్డిలు మీ నియోజకవర్గాలకు ఏం తెలేని వారు కేంద్రమంత్రులు గా కొనసాగే అర్హత ఉందా ..?
- బిఆరెస్ నేతలు కాళేశ్వరం పై తప్పులు ఒప్పుకొని ముక్కు నేలకు రాయాలి
- విహారయాత్రలకు పోయినట్టు కాళేశ్వరం పోయి ఏం సాధించారు
- మాకు అన్యాయం జరిగిందని నిరసన తెలపడానికి నీతి అయోగ్ సమావేశానికి వెళ్ళలేదు

**హైదరాబాద్, జూలై 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)** తెలంగాణ లో ప్రభుత్వం తరుపున ప్రవేశపెట్టిన బడ్జెట్ లో హైదారాబాద్ నగరానికి సంబంధించి మౌలిక సదుపాయాల కల్పన, పెరుగుతున్న జనాభా కి అనుగుణంగా 10 వేల కోట్ల నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క హైదారాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మీడియా తో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెలంగాణ పైన వివక్ష చూపుతూ కక్ష పూరితంగా వ్యవహరిస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. హైదరాబాద్ లో జీహెచ్ఎంసీ, హెచ్ఎండిఏ ,మెట్రో వాటర్ వర్క్స సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పోరేషన్ దాంతో పాటు హైదారాబాద్ కి కి సంబంధించి మెట్రో అభివృద్ధి చెందుతున్న అంశాలు ఆర్థిక లేమి తో కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు.నూతనంగా హైడ్రా,మూసి ప్రక్షాళన ,మెట్రో ఇతర అంశాలకు 10 వేల కోట్లు కేటాయించారన్నారు.కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గారు హైదరాబాద్ నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నారని , గతంలో టూరిజం నుండి మంత్రిగా ఉన్నపుడు కూడా హైదరాబాద్ కోసం హెరిటేజ్ కి ఒక్క రూపాయి తీసుకురాలేదని మండిపడ్డారు. స్మార్ట్ సిటీ వస్తె రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు హైదారాబాద్ నుండి కరీంనగర్ కు మార్చారు.ఆనాడు కరీంనగర్ కు స్మార్ట్ సిటీ అవసరం ఉందని కానీ హైదరాబాద్ కి అదనంగా స్మార్ట్ సిటీ తేవడానికి పెరుగుతున్న జనాభా కి అనుగుణంగా నీటి వనరులను పెంచడానికి చారిత్రాత్మక హైదారాబాద్ హెరిటేజ్, టూరిజం , ఆర్కియాలజీ ద్వారా అభివృద్ధి చేయడానికి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదనీ విమర్శించారు.రాష్ట్ర ప్రభుత్వం 10 వేల కోట్లు ఇచ్చిందనీ కేంద్ర ప్రభుత్వం నుండి గ్రాంట్ల రూపంలో గాని లేదా స్థానిక సంస్థలను బలోపేతం చేయడానికి రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు ఎన్ని నిధులు తీసుకొస్తారని ప్రశ్నించారు.ఇక్కడి నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు బడ్జెట్ సవరణ ల ద్వారా హైదారాబాద్ అభివృద్ధికి, తెలంగాణ అభివృద్ధికి నిధులు తెచ్చి మీ చిత్తశుద్ధి నిరూపించుకోవాలనీ పేర్కొన్నారు.హైదరాబాద్ అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. ఏస్ఆర్డిపి ,ఎస్ఎన్డిపీ ద్వారా రోడ్ల నిర్మాణాలు ,నాళాల పునరుద్ధరణ చేపట్టడానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.తాగు నీటికి అమృత్ పథకం కింద నిధులు కేటాయించాలని తెలిపారు. ఇళ్ల నిర్మాణానికి వీధి వ్యాపారాలకు ఆర్థిక సహాయం చేయడానికి కృషి చేయాలని కోరారు.కేంద్ర మంత్రులు బండి సంజయ్ , కిషన్ రెడ్డి లు బడ్జెట్ చాల బాగుంది అందరికీ ఆమోదయోగ్యంగా ఉందని చెప్తున్నారు మీ నియోజకవర్గాలకు ఏం తెలేని వారు మీరు కేంద్ర మంత్రులుగా ఉండే అర్హత ఉందా అని ప్రశ్నించారు.కేంద్ర ప్రభుత్వం గాడిద గుడ్డు ఒక రూపాయి కూడా ఇవ్వని బీజేపీ నేతలు ఏం ముఖం పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు.మీకు చేతనైతే మీకు తెలంగాణ డీఎన్ఏ మీ రక్తంలో ఉంటే తెలంగాణ ను వ్యతిరేకించిన ప్రధాని మోడీ నీ నివేదించి తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం నిధులు తెగలిగే సత్తువ ఉంటే రావాలని సవాలు విసిరారు. కేంద్రం నిధుల విషయంలో శాసన సభ లో తీర్మానం చేశామని అఖిలపక్షానికి నాయకత్వం వహించండనీ బీజేపీ నేతలకు సూచించారు ప్రధాన మంత్రిగారి దగ్గర ఇంకా మీకు సంబంధించి ఎవరినైనా కలవడానికి మేము సిద్ధంగా ఉన్నామన్నారు.గత ప్రభుత్వం 10 సంవత్సరాల్లో సహకరించలేదను సమన్వయం లేనందునే నిధులు ఇవ్వలేదన్న మీరు మా ముఖ్యమంత్రి మంత్రులు పార్లమెంట్ సభ్యులు అనేకే సార్లు ప్రధాని మోడీ మీ కేంద్ర మంత్రులను కలిసినప్పటికీ ఎందుకు వివక్ష చూపించారని తెలిపారు.తెలంగాణ విభజన హామీలకు సంబంధించి తెలంగాణ ప్రయోజనాలకు సంబంధించి రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి కూడా నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారనీ రాష్ట్రంలో నిరుద్యోగ యువత కోసం స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.కేంద్రం సహకారం చేసే అవకాశం ఉన్నప్పటికీ మాటలకే పరిమితం అవుతున్నారన్నారు. బీజేపీ నాయకత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాని ఇంకా సమయం మించి పోలేదు బడ్జెట్ సెషన్ లోనే కేంద్ర నాయకత్వాన్ని ఒప్పించి మెప్పించి అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వం నుండి మా ప్రతినిధి బృందం రావడానికి సిద్ధంగా ఉందన్నారు.కేంద్ర ప్రభుత్వాన్ని నిధులు అడగడానికి తమకు ఏం నాముషీ లేదనీ ఫెడరల్ సిస్టమ్ లో అది తమ హక్కు గా భావిస్తామన్నారురాష్ట్రం నుండి ప్రాతినిధ్యం




వహిస్తున్న కేంద్ర మంత్రులు ముందుకు వచ్చి నిధులు తేవడానికి సంబంధించి చొరవ చూపెట్టాలని కోరారు.కిషన్ రెడ్డి గారు తనది బొగ్గు శాఖ అనుకున్నప్పటికి ఆ శాఖ కు సంబంధించి మినరల్ డెవలప్మెంట్ , %ఎంతీ% నిధుల నుండి హైదారాబాద్ కి నిధులు కేటాయించాలని సూచించారు.గంగా ప్రక్షాళనకు వందల, వేల కోట్ల రూపాయలు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం మూసి ప్రక్షాళనకు విస్మరించిందన్నారు. మెట్రో రైల్ పాత నగరంతో పాటు ,శివారు ప్రాంతాలకు తీసుకుపోవడానికి నిధులు తీసుకోవాలన్నారు.బడ్జెట్ లోని ప్రతి అంశం కేటాయింపులో బీసీ లకు భాగస్వామ్యం ఉందన్నారు. బలహీన వర్గాలకు అన్యాయం జరగనిచ్చే పరిస్థితి లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.ఎస్సి, ఎస్టీ ,బీసీ మైనారిటీ వర్గాలకు న్యాయం జరగాలని ముఖ్యమంత్రి మంత్రి వర్గం భావిస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు కూడా బలహీన వర్గాల రిజర్వేషన్లకు సంబంధించి ఓటర్ల లిస్ట్ రావాలి .బీసీ గణన జరగాలి దాని తరువాత నే ఎన్నికలకు పోవాలని ఎన్నికలకు జాప్యం అవుతుందన్నారు. ప్రభుత్వం బీసీ ల పట్ల కమిట్మెంట్ తో ఉందన్నారు.గత ప్రభుత్వం కేంద్రంతో డిల్లీలో దోస్తీ గల్లీలో కుస్తీలా వ్యవహరించిందన్నారు. గత ప్రభుత్వం అన్ని బిల్లులకు మద్దతు తెలిపి నీతి అయోగ్ బహిష్కరించడం వల్ల పెద్ద పని చేశామని అనుకుంటే సరిపోదనీ రైతు బిల్లులకు ,370 ఆర్టికల్ , జీఎస్టీ తదితర బిల్లులకు సపోర్ట్ చేసి నితి ఆయోగ్ హాజరుకనంత మాత్రానా ఏం ప్రయోజనం జరిగిందని ప్రశ్నించారు..



## చుండ్రు వీర్రాజు చౌదరికి డాక్టరేట్

**కాజులూరు జులై 27(వార్తాప్రభ)**కాజులూరు మండల పరిధిలోని గొల్లపాలెం గ్రామానికి చెందిన చుండ్రు వీర్రాజు చౌదరి చేసిన సామాజిక సేవలకు గాను ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీ చర్చ్ యూనివర్సిటీ ఆయనకు గౌరవ డాక్టరేట్ అవార్డును ప్రధానం చేసింది. శనివారం తమిళనాడు రాష్ట్రం హెూసూర్ పట్టణము నందు ఏసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ ఫౌండర్ విజయాన్ అకాడమీ మాస్టర్ వి బాబు విజయన్ చేతుల మీదుగా చుండ్రు వీర్రాజు చౌదరి డాక్టరేట్ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ వీర్రాజు చౌదరి మాట్లాడుతూ నిష్కలంకమైన సేవలకు నిజమైన గుర్తింపు ఎప్పుడు లభిస్తుందని ప్రతి ఒక్కరూ సమాజ సేవ చేయాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు మంత్రులు ఎమ్మెల్యేలు పలు పార్టీల నాయకులు అభిమానులు డాక్టర్ వీర్రాజు చౌదరికి శుభాకాంక్షలు తెలియ చేశారు.

## మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారం




**హనుమాన్ జంక్షన్, జులై 27(వార్తాప్రభ)**హనుమాన్ జంక్షన్ లోని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం మెడిసిన్ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థిని దోమ సురేఖ కు 25,000 వేల రూపాయల ప్రతిభా పురస్కారం తో పాటు ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందించారు. సురేఖ పిన్నమనేని సిద్దార్ధ లో ఎం బి బి యస్ 4 వ సంవత్సరం చదువుతున్న సురేఖ కు తల్లిదండ్రులు లేరు. బంధువులు చదివిస్తున్నారు. అయినా పట్టుదలతో తమ ఆశయం కోసం ప్రథమస్థానంలో నిలిచిన సురేఖ గుర్తించిన మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మానవత కార్యాలయంలో సభ్యుల సమక్షంలో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు ఎన్ రామచంద్రారెడ్డి సురేఖ ను ప్రత్యేకంగా అభినందంచారు. ఈ కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర కన్వీనర్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు, పంచాయతీరాజ్ ఏ. ఇ , డి. జైరాజ్, అధ్యక్షులు గూడపాటి జయ రామచంద్రారావు, కార్యదర్శి పాబోలు గణేష్ బాబు, కోశాధికారి ఘంటా ఇందిర దేవి, జిల్లా కోశాధికారి జన్యావుల వీర వెంకట సత్యనారాయణ, వేగిరెడ్డి సూర్యనారాయణ, నారగాని కొండలరావు, దయాల ప్రభాకరరావు, పి వి చలం, రేవిణిశెట్టి సూర్యనారాయణ,జి మల్లిఖార్జునరావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ ను ప్రశ్నించిన గుడివాడ ఎమ్మెల్యే- జబాబు ఇచ్చిన జిల్లా కలెక్టర్!!!



**మచిలీపట్నం జులై 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మచిలీపట్నం శనివారం కృష్ణా జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్లో నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లాలో ఉన్న స్థానిక శాసనసభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గుడివాడ నియోజవర్గం శాసనసభ్యులు వేనిగండ్ల రాము తమ నియోజకవర్గంలో ఉన్న సమస్యలను గనులు, భూగర్భ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకువెళ్లారు. ఇటీవల కాలంలో గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రిలో ఇద్దరు గర్భిణీ స్త్రీలు మెరుగైన వైద్యం అందక మృతి చెందారని, ఆసుపత్రిలో ఉన్న సమస్యలను, సదుపాయాలను, మెరుగైన వైద్యం పై జిల్లా అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడానికి ఎంత ప్రయత్నం చేసినా అధికారులు అందుబాటులో లేరని స్వయంగా స్థానిక శాసనసభ్యునకు ఇలాంటి పరిస్థితి ఎదురైతే సాధారణ ప్రజల పరిస్థితి ఏమిటని కలెక్టర్ ను ప్రశ్నించారు. ప్రభుత్వ ఆసుపత్రి సమస్యలపై అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆసుపత్రిను సందర్శించిన దాఖలాలు లేవని అన్నారు. ఆంధ్ర రాష్ట్రం లో నూతన ప్రభుత్వం ఏర్పాటు చేసి 50 రోజులు గడుస్తున్నా జిల్లా కలెక్టర్ గాని జాయింట్ కలెక్టర్ గాని తమ నియోజకవర్గంలో ఒక్కసారి కూడా పర్యటించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గుడివాడ శాసనసభ్యులు వెనిగండ్ల రాము చేసిన వ్యాఖ్యలకు జిల్లా కలెక్టర్ స్పందించి సమాధానం చెప్పారు. జిల్లాలో ఎప్పుడు అధికారులు ప్రజలకు, నాయకులకు అందుబాటులోనే ఉంటున్నారని తెలిపారు. ఒకవేళ అధికారులకు, నాయకులు మధ్య అంతరం ఏర్పడినట్లయితే అలాంటి అసౌకర్యాన్ని ఇంకోసారి జరగకుండా అధికారులు నాయకులకు అందుబాటులో ఉంటారని హామీ ఇచ్చారు. అధికారులు, నాయకులు సమన్వయంతో ప్రజలకు మెరుగైన పాలన అందిస్తామని అన్నారు.

## దుర్గా ఘాట్ లో భక్తుల స్నానాలకు ఏర్పాటుకు వినతి



**విజయవాడ పశ్చిమ, జులై 27 (వార్తా ప్రభ ప్రతినిధి)** కృష్ణానది దుర్గా ఘాట్ లో భక్తులకు స్నానాలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని దుర్గగుడి ఈవో కెఎస్. రామారావుకు రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన ఉపాధ్యక్షులు ఎర్రంశెట్టి అంజిబాబు ఒక వినతిపత్రం సమర్పించారు. శనివారం సాయంత్రం ఈవోని కలిసిన అంజిబాబు ఈమేరకు ఆయనకు వినతిపత్రం ఇవ్వడం జరిగింది . దుర్గా ఘాట్ లో భక్తులకు అవసరమైన మరుగుదొడ్లు లేవని, అలాగే మహిళా భక్తులు దుస్తులు మార్చుకునేందుకు కూడా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉందని అన్నారు. అలాగే దుర్గగుడి ఘాట్ రోడ్లో కొండ చరియలు విరిగిపడకుండా శాశ్వత ఏర్పాట్లు చేయాలని కోరారు. ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

# సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

### ■ టీజేఏ నూతన జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన పంతం సురేందర్ కు శుభాకాంక్షలు తెలిపిన ఝాన్సీ రెడ్డి



**తొర్రూర్ జులై 28 (వార్తా ప్రభ)** తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ మహబూబాబాద్ జిల్లా నూతన అధ్యక్షుడిగా పంతం సురేందర్ ఎంపికైన సందర్భంగా తొర్రూరు కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి హనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డిని, స్థానిక జర్నలిస్టు సంఘ నాయకులతో మర్యాదపూర్వకంగా కలిసి ఆమెను శాలువాతో సత్కరించడం జరిగింది. అనంతరం , నూతన అధ్యక్షుడిగా ఎంపికైన పంతం సురేందర్ కు మిఠాయిని అందజేసి ఝాన్సీ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేస్తూ సమాజంలో జరుగుతున్న అన్యాయాలను అక్రమాలను అరికట్టుటకు, నిరంతరం నిజమైన వార్తలు రాస్తూ సమాజ మార్పుకు కృషి చేయాలన్నారు. ప్రజా సమస్యలను వెలికి తీసి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమాజ శ్రేయస్సు కు దోహదపడాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగ సురేందర్ ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఇచ్చిన బాధ్యతను కర్తవ్యా దీక్షతో పనిచేసి సమాజంలో మంచి గుర్తింపును సాధించి భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలవాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో, తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ స్థానిక జర్నలిస్టు నాయకులు ధర్మారపు యాకయ్య పస్తం సాంబ మడి పెద్ది దిలీప్ బూరుగు శ్రీకాంత్ ఎండి బషీర్ గాదె కృష్ణ కొండేం ఉమేష్ మనోహర స్వామి శివ మంగళపల్లి నాగరాజు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# 100 సం.ల చరిత్ర కలిగిన "అఖిల భారత యాదవ మహాసభ" పేరును వాడుకుంటే చట్టపరంగాచర్యలు

### -అఖిల భారత యాదవ మహాసభ జాతీయ, రాష్ట్ర నాయకుల హెచ్చరిక




**హైదరాబాద్, జులై 27 (వార్తాప్రభ ప్రతినిధి)** అఖిల భారత యాదవ మహాసభ శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న వేళ అఖిల భారత యాదవ మహాసభకు సంబంధం లేని వ్యక్తి గడ్డం శ్రీనివాస్ యాదవ్ ఒక నకిలీ బోగస్ సంస్థ నుండి అధ్యక్షులు అయినట్లు పత్రిక ప్రకటనలో రావడం పట్ల అఖిల భారత యాదవ మహాసభ జాతీయ మరియు రాష్ట్ర నాయకులు తీవ్రంగా ఖండిస్తున్నాం అని కాచిగూడ రాష్ట్ర సంఘ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో అఖిల భారత యాదవ మహాసభ జాతీయ, రాష్ట్ర నాయకులు తెలిపారు. అఖిల భారత యాదవ మహాసభ గత వంద సంవత్సరాలుగా నిర్విరామంగా పనిచేస్తూ 1924 సంవత్సరం నుండి ఎందరో మహానుభావులు లోక్‌సభ




స్పీకర్లుగా, రాజ్యసభ వైస్ ఛైర్మన్లుగా, కేంద్ర మరియు రాష్ట్ర మంత్రులుగా, పలు రాష్ట్ర ముఖ్యమంత్రులుగా, ఉప ముఖ్యమంత్రులుగా, పార్లమెంట్ సభ్యులుగా, ఎమ్మెల్యేలుగా అఖిల భారత యాదవ మహాసభ జాతీయ అధ్యక్షులుగా మరియు కార్యవర్గ సభ్యులుగా సేవలందించారు అని తెలుపుటకు గర్వంగా ఉంది. మాజీ కలకత్తా షరీఫ్ డాక్టర్ స్వాపన్‌కుమార్ ఘోష్ యాదవ్ ప్రస్తుత జాతీయ అధ్యక్షులు, ప్రస్తుత శతాబ్ది ఉత్సవ సమితి ఛైర్మన్ మరియు జాతీయ ఉపాధ్యక్షులు సత్య ప్రకాష్ సింగ్ యాదవ్ , అఖిల భారత యాదవ మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా బద్దుల బాబు రావు యాదవ్ లు పనిచేస్తున్నారన్నారు. అటువంటి చరిత్ర కలిగిన అఖిల భారత యాదవ మహాసభ తమిళనాడుకు చెందిన కొంత మంది నకిలీ బోగస్ సంస్థను సృష్టించి, తమిళనాడుకే పరిమితమైన సంఘాన్ని అఖిల భారత యాదవ మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా గడ్డం శ్రీనివాస్ యాదవ్‌ను నియమించటం ముమ్మాటికీ చట్ట విరుద్ధం, తెలంగాణ రాష్ట్రంలో ఉన్న యాదవులను తప్పుదోవ పట్టిస్తూ ఎటువంటి అజెండా లేకుండా కేవలం తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని తెలిపారు. అఖిలేష్ యాదవ్ మాజీ ముఖ్యమంత్రి మరియు ప్రస్తుత పార్లమెంట్ సభ్యులు అతని సూచన మేరకు నియమితులైనారని పత్రికలో తెలపడం చాలా దారుణమాన్నారు. యాదవ సంఘ నియామకాల్లో అఖిలేష్ యాదవ్ జోక్యం ఉండదని వారు తెలిపారు ...కనీసం యాదవ మహాసభ కార్యవర్గ సభ్యునిగా కూడా పనిచేయని గడ్డం శ్రీనివాస్ యాదవ్ నకిలీ బోగస్ సంస్థతో చేతులు కలిపి యాదవులను తప్పు దోవ పట్టిస్తున్నారని తెలిపారు. ఇకపై రాబోవు కాలంలో అఖిల భారత యాదవ మహాసభ సంస్థ పేరును వాడుకున్నట్లైతే ఖచ్చితంగా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింతల రవీంద్రనాథ్ యాదవ్, జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్. లక్ష్మణ్ యాదవ్, జాతీయ కార్యదర్శి ఏ రమేష్ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మేకల రాజేందర్ యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిలు బైకెన్ శ్రీనివాస్ యాదవ్, పోచబోయిన శ్రీహరి యాదవ్, రాష్ట్ర కోశాధికారి దారబోయిన శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి దొంతిబోయిన శ్రీనివాస్ యాదవ్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మేల్కొల్ మహేందర్ యాదవ్, జాతీయ యువజన కార్డినేటర్ గొర్ల యశ్వంత్ యాదవ్, గ్రేటర్ హైదరాబాద్ యువత అధ్యక్షులు యం. విజయ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్రంలో విద్యకు అగ్ర పీఠం

### ■రాష్ట్ర ఎక్సైజ్ గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర!!!

**మచిలీపట్నం జులై 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రాబోయే రోజులలో రాష్ట్రవ్యాప్తంగా విద్యకు అగ్ర పీఠం వేస్తున్నామని నిరుద్యోగులకు స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లుగా రాష్ట్ర ఎక్సైజ్ గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శనివారం మచిలీపట్నం లేడీ యాంతుల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డేకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద గల ఆశీర్వాద్ భవనంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మచిలీపట్నం యొక్క చరిత్రను మార్చుతున్నామని అన్నారు. రాబోయే రెండు సంవత్సరాల్లో బందర్ పోర్ట్ నిర్మాణం పూర్తవుతుందని అనేక అనుబంధ సంస్థలు వస్తున్నాయని నిరుద్యోగులకు ఉద్యోగాలు అందుబాటులోకి వస్తున్నట్లుగా ఆయన తెలిపారు. రాష్ట్ర




విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో యువతకు బంగారు భవిష్యత్తు ఉంటుందని ఆయన అన్నారు. కృష్ణా జిల్లా లో ప్రభుత్వపరంగా ఉన్న ఏకైక మహిళ బాలికల జూనియర్ కళాశాలకు కావలసిన అదనపు గదుల నిర్మాణాన్ని త్వరలోనే చేపడుతామని ఆయన విద్యార్థినుల హర్షధ్వానాల మధ్య హామీ ఇచ్చారు ప్రభుత్వపరంగా మొట్టమొదటి అఫీషియల్ ప్రోగ్రాం కళాశాల విద్యార్థుల మధ్య జరుపుకోవడం తనకి ఎంతగానో సంతోషకరంగా ఉందని రవీంద్ర అన్నారు. ప్రతి విద్యార్థిని దిశా నిర్దేశం చేసుకొని తమ యొక్క విద్యను కొనసాగించాలని అన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ అయనంపూడి ఆనంద కుమార్ కళాశాల యొక్క చరిత్రను తెలియజేశారు. ఈ ఏడాది 435 మంది ఇంటర్లో చేరటం కళాశాల అభివృద్ధికి తార్కానమని అన్నారు. కళాశాల అభివృద్ధి కమిటీ మాజీ కార్యదర్శి సిటీ కేబుల్ ఎండి కొల్లు శ్రీనివాసరావు మాట్లాడుతూ గత 22 సంవత్సరాలుగా లేడి అంకుల్ కళాశాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలియజేశారు. మహిళలు చదువుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. కమిటీ మాజీ సభ్యులు లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ అనేది కీలకమైనదని విద్యార్థినిలు చదువు పై దృష్టి కేంద్రీకరించాలని ప్రేమ అనే వ్యవహారానికి దూరంగా ఉండాలని అన్నారు. తెలిసి తెలియని వయసులో ప్రేమలో పడటం వలన అనేకమంది ఆడపిల్లలు జీవితాన్ని కోల్పోతున్నారని బాలాజీ తెలియజేశారు. ఇంటర్మీడియట్ జిల్లా అధికారి ఎస్ సాల్మన్ రాజు మాట్లాడుతూ కళాశాలలో అద్భుతమైన ఫలితాలు వస్తున్నాయని ప్రభుత్వపరంగా కేవలం అతి తక్కువ ఫీజుతో ఛదువులు అందిస్తున్నామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి వెంకట బాబా ప్రసాద్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ భగత్, మాజీ జడ్పిటిసి సభ్యులు లంకె నారాయణ ప్రసాద్, గుడివాడ మాజీ మున్సిపల్ చైర్మన్, రాష్ట్ర హ్యూమన్ రైట్స్ కమిషన్ జనరల్ సెక్రెటరీ గోవాడ శాంతి లెక్చరర్లు ఎల్ కె హరినాథ్ బాబు మమనవర్,రాంబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థినిల సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి

# విద్యార్థులపై వెలకట్టలేని ప్రేమను చూపిస్తున్న పెద్దెల్లి దంపతులు!!

### ■ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటుబుక్కులు పెన్నులు ఉచిత పంపిణీ ■ దాత ఆసంపల్లి శ్రీనివాసుకు ప్రత్యేక కృతజ్ఞతలు ■ పెద్దెల్లి తేజస్వి ప్రకాష్, 11వ డివిజన్ కార్పొరేటర్




**పెద్దపల్లి/ గోదావరిఖని: జులై 27 (వార్తాప్రభ ప్రతినిధి )**విద్యార్థులపై వెలకట్టలేని ప్రేమను చూపిస్తున్నరు పెద్దెల్లి దంపతులు. తాజాగా శనివారం 11వ డివిజన్ పరిధిలోని ఫైవ్ ఇంక్లైన్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు ఆసంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాత వాసు సహకారంతో నోటుబుక్కులు పెన్నులు ఉచితంగా పంపిణీ చేశారు కార్పొరేటర్ పెద్దెల్లి తేజస్వి ప్రకాష్. బుక్స్ పంపిణీ చేసిన అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ..... అట్టడుగు స్థాయి నుంచి ఉన్నత స్థాయికి తీసుకువెళ్లే ఏకైక మార్గం కేవలం విద్య మాత్రమే అని విద్యార్థులకు సూచించారు. అందుచేత ప్రతి విద్యార్థి చిన్ననాటి నుండే ఉన్నతమైన లక్ష్యాలను పెట్టుకొని సమాజానికి గొప్ప సేవను అందించే జీవితంలో స్థిరపడాలి అని సూచించారు. సేవా కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ సమ్మయ్య, టీచర్లు రజిని, జ్యోతి, సుభాష్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు మద్దెల రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## నిమ్రా వైద్య కళాశాల లో అనాటమిస్ట్ మీట్ 2024 వర్క్ షాప్



**ఇబ్రహీంపట్నం జులై 27(వార్తా ప్రభ ప్రతినిధి):–** స్థానిక నిమ్రా మెడికల్ కళాశాలలో శనివారం నాడు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ అనాటమిస్టుల 21వ రీజనల్ సొసైటీ ఆఫ్ అనాటమిస్ట్స్ మీట్ 2024 వర్క్ షాప్ మరియు కాన్ఫెరెన్స్ నిర్వహించారు. 3 రోజులపాటు జరిగే ఈ సదస్సు లో తెలుగు రాష్ట్రం నుండి ప్రముఖ వైద్య రంగ ప్రొఫెసర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొదటిరోజుఫీటల్ టిష్యు ప్రాస్సింగ్ అండ్ స్టెయినింగ్ అను అంశం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో వలువురు అనాటమిస్టులు భాగస్వాములయ్యారు. అపోలో చిత్తూరు కళాశాల ప్రొఫెసర్ శుభద్రదేవి, ఎన్నారై కళాశాల ప్రొఫెసర్ మరియు పాథాలజి విభాగాధిపతి డ వి రేణుకా మరియు అడిషనల్ ప్రొఫెసర్ డా యోగేష్ లు ముఖ్య వక్తలుగా వ్యవహరించారు. వారు అనేక అంశాలపై విద్యార్థిని విద్యార్థులకు తమ అనుభవజ్ఞమైన ఉపన్యాసం ద్వారా అవగాహన కల్పించారు. మాట్లాడుతూ సమస్య ఏర్పాటు చేసిన కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు డా బాబులాల్, డా శ్యామ్ ప్రసాద్ , డీన్ డా కృష్ణమూర్తి,వైస్ ప్రిన్సిపాల్ డా జయరామ్ పాల్గొన్నారు

## వెంకటేశ్వర స్వామి సన్నిధిలో దారపనేని కుటుంబ సభ్యులు



**కనిగిరి జులై 27 వార్తా ప్రభ ప్రతినిధి** నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం రామాపురం గ్రామంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని పెండ్యాల సూర్యనారాయణ కుటుంబ సభ్యులు వైభవంగా దేవస్థానాన్ని నిర్వహిస్తున్నారు. శనివారం కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, ధర్మపత్ని పద్మ, కుమారులు తేజ కృష్ణ, చైతన్య కృష్ణ స్వామి వారిని దర్శించుకున్నారు. మారుమూల గ్రామం రామాపురంలో సొంత నిధులతో ఇంతటి ప్రతిష్టాత్మకమైన దేవస్థానాన్ని పెండ్యాల సూర్యనారాయణ నిర్మించడం అభినందనీయమని దారపనేని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. దర్శనానంతరం పెండ్యాల సూర్యనారాయణ, మరియు ఆలయ కమిటీ సభ్యులు దారపనేని కుటుంబ సభ్యులకు స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## అమ్మ పేరుతో మొక్క నాటుదాం

**హనుమాన్ జంక్షన్,జులై 27(వార్తాప్రభ)** హనుమాన్ జంక్షన్ సిద్ధార్థ విద్యాలయ స్కూల్లో 'అమ్మ పేరుతో మొక్క నాటుదాం' అనే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విదానంలో భాగంగా ఈ రోజు శనివారం సాయంత్రం 3 గం? లకు మండల విద్యాధికారి బట్టు సురేష్ ఆధ్వర్యంలో 'అమ్మ పేరుతో మొక్క నాటుదాం' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 100 కు పైగా మొక్కలను పిల్లలు వారి తల్లి తండ్రుల సమక్షంలో నాటించడం జరిగినదని స్కూల్ ప్రదానోపాధ్యాయురాలు వీరమాచినేని ధనలక్ష్మి తెలియజేశారు. ఈ కారాయక్రమంలో మండల విద్యాదికారిమాట్లాడుతూ భూమి పై మొక్కలు చాలా అవసరం, మొక్కలు పెంపకం వల్ల కాలుష్యాన్ని నివారించవచ్చు మరియు ఆక్సిజన్ పెంపొందించటం, సకాలంలో వర్షాలు రావడానికి సహకరిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు అక్కినేనీ రాఘవేంద్రరావు మొక్కలు పెంపకం ద్వారా భూమిని పరిరక్షించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# గేదెల దొంగలు అరెస్ట్

## ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

## ఏడుగురిలో ఇద్దరు మహిళలు

**జి.కొండూరు: జూలై 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మండలంలోని వివిధ గ్రామాల్లో సంచరిస్తూ రాత్రివేళ గేదెలను వ్యాను లో ఎక్కించి తరలించుకుపోతున్న ఏడుగురు నిందితులను శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ షబ్బీర్ అహ్మద్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మునగపాడు, గంగినేని పాలెం, కవులూరు,కందులపాడు గ్రామా లలో గుర్తు తెలియని వ్యక్తులు గేదెల ను దొంగలిస్తున్నారని ఆయా గ్రామాల నుంచి ఫిర్యాదులు రావడంతో పోలీసు ల నిఘా పెట్టామని తెలిపారు.శనివారం తెల్లవారు జామున గేదెలను దింగిలిస్తున్న ఏడుగురు నిందితులను జి.కొండూరు గుడిసెంటర్ లో అరెస్టు చేశామన్నారు.వీరిలో ఇద్దలు మహిళలు ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.ఇప్పటివరకు వీరు 5 గేదెలను దొంగిలించినట్లు తెలిపారు.నరసరావుపేట కు చెందిన గద్దల ఏసుబాబు, గద్దల నాగలక్ష్మి, కొమరు వెంకటేశ్వర్లు, ప్రత్తిపాటి దైవ కృప,చల్ల వీరాంజనేయులు, మార్కపుడి వంశీ, సోము గోవిందు లను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని పోలీసులు తెలిపారు.

# మైలవరం సబ్ డివిజన్ మహిళా పోలీస్ లకు వర్క్ షాప్

## ఉమెన్స్ సేఫ్టీ, సైబర్ క్రైమ్, డ్రగ్ అబ్యూస్ వంటి అంశాలపై అవగాహన



**మైలవరం జూలై 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)** :మైలవరం ఏసీపీ కార్యాలయంలో మైలవరం సబ్ డివిజన్ పరిధిలోని మహిళా పోలీసులకు శనివారం వర్క్ షాప్ నిర్వహించారు.ఈ వర్క్ షాప్ లో ఏసీపీ ఎస్.మురళీ మోహన్ ఉమెన్స్ సేఫ్టీ, సైబర్ క్రైమ్, డ్రగ్ అబ్యూస్ వంటి అంశాలపై మహిళా పోలీసులకు అవగాహన కల్పించారు. చిన్నపిల్లలకు సంబంధించి గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి వివరిస్తూ స్కూల్స్, అంగన్వాడీ, కాలనీస్ లలో పిల్లలకు ఏ విధంగా అవగాహన కలిగించాలో తెలియజేశారు. ప్రస్తుతం జరుగుతున్న వివిధ రకాల సైబర్ నేరాలు ఓటీపీ ఫ్రాడ్, పాస్వర్డ్ ,ఐడెంటిటీ తెఫ్ట్ ,ఫేక్ పోలీస్, లోన్ ఆప్స్ ,ఫేక్ జాబ్ ఆఫర్స్, ఫేక్ వర్క్ ఫ్రం హెూం జాబ్స్ , ఆన్లైన్ ట్రేడింగ్ ,ఆన్లైన్ గేమింగ్ వంటి వాటి గురించి ప్రజలకు ఏ విధంగా అవగాహన కల్పించాలో ఏసీపీ తెలియజేశారు.యువత సెల్ ఫోన్ల యందు,సోషల్ మీడియా ప్లాట్ఫామ్స్ లలో అనగా ఫేస్బుక్ , యూట్యూబ్ , ఇన్స్టాగ్రామ్,టెలిగ్రామ్ లలో వచ్చే యాడ్స్ చూసి అది నిజమే అనుకుని సదరు లింక్స్ క్లిక్ చేయడం ద్వారా సైబర్ నేరగాళ్ల యాప్ పోర్టర్లోకి వెళ్లి మోసాల బారిన పడకుండా అవగాహన కలిగించాల్సిందిగా మురళీ మోహన్ మహిళా పోలీసులకు సూచించారు. యువత గంజాయి బారిన పడి చెడు మార్గంలోకి జారిపోకుండా అవగాహన కల్పించడం అలాగే గంజాయి సరఫరా పెడలింగ్ వంటి నేరస్తుల సమాచారం నిఘా పై చర్చించారు.ఈ సదస్సులో మైలవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ కొత్తూరు కిషోర్ బాబు,తిరువూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ షేక్.అబ్దుల్ నబీ,సబ్ డివిజన్ ఎస్ఐ లు సిబ్బంది పాల్గొన్నారు.

# పెడన ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భారీ అన్నప్రసాద వితరణ



**పెడన జూలై 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పట్టణ ఆర్యవైశ్య సంఘం శ్రీ వాసవి మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వాసవి క్షేత్రము నందు ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి శాకంబరీ అలంకారం సందర్భాన్ని పురస్కరించుకొని శనివారం శ్రీ వాసవి ప్రార్థన మందిరము నందు శ్రీ వాసవి మాతకు అన్నప్రసాదాల నైవేద్యాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో విశేషంగా సమర్పించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ అన్న ప్రసాదాల వితరణ కార్యక్రమంలో పెడన పట్టణ మండల ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున పాల్గొని శ్రీ వాసవి మాత అన్న ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఆర్యవైశ్యులు జై వాసవి జై జై వాసవి అని స్మరిస్తూ వాసవి నామస్మరణతో ఈ ప్రాంగణం మారుమ్రోగింది. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు డా. కొల్లూరి చిన్న పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు ఆత్మకూరి సురేష్ కుమార్ ఉపాధ్యక్షులు కొల్లిపర నరసింహారావు చిలకల శ్రీనివాస్ గుప్తా కొల్లిపర పూర్ణ ప్రదీప్ గుప్తా ఆర్గనైజింగ్ కార్యదర్శి కొల్లూరి రాజా కార్యదర్శిలు కోడూరి రమేష్, జవాజి నాగు ఉత్సవముల కమిటీ కన్వీనర్ కొల్లూరి రాధాకృష్ణ శ్రీ వాసవి మహిళా మండలి గౌరవ అధ్యక్షురాలు కొమ్మూరి సుధారాణి అధ్యక్షురాలు తమ్మన లక్ష్మీ తాయారు కోశాధికారి పొన్నూరు అపర్ణ కార్యవర్గ సభ్యులు కొల్లూరి పద్మ మామిడి లావణ్య కొల్లూరి అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

# నందీశ్వరుడి చెవిలో కోరికలు చెప్పడానికి నియమాలున్నాయి..! సరైన మార్గం ఏమిటంటే



హిందూ మతంలోశివ ప్రథమ గణాల్లో నందీశ్వరుడికి ప్రముఖ స్థానం ఉంది. నంది శివుడి వాహనం కూడా.. ఏ శివాలయాల్లోకి వెళ్ళినా అక్కడ ముందుగా కనిపించేది శివుడికి ఎదురుగా ఉండే నంది. శివునికి అభిముఖంగా నంది విగ్రహం దర్శనం ఇస్తుంది. నందిని శివునికి ఇష్టమైన సభ్యుడిగా పరిగణిస్తారు. శివయ్య సేవ నంది ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాడు. అంతేకాదు శివుని ద్వారపాలకుడిగా నంది శివుని సేవిస్తాడని నమ్మకం. అందుకనే ఎవరైనా భక్తులు తమ కోరికను నంది చెవిలో చెప్పడం ద్వారా అది నేరుగా శివునికి చేరుతుందని కూడా విశ్వాసం. శివునికి నంది అంటే అపారమైన ప్రేమ..అతను చెప్పేదంతా వింటాడు. కనుక నందిని ఆరాధించడం విశిష్టమైనదని భావిస్తారు. ఎవరైతే తమ కోరికను నందిశ్వరుడి చెవిలో చెబుతారో ఆ కోరికను శివుడు తప్పకుండా తీరుస్తాననే వరం నందికి శివుడు ఇచ్చాడనే నమ్మకం ఉంది. ఈ విషయాన్నీ పురాణ గ్రంథాలలో కూడా వివరించారు. పురాణ గ్రంథాల ప్రకారం శివుడు ఎక్కువ సమయం ధ్యానంలో నిమగ్నమై ఉంటాడు. శివుని ధ్యానంలో ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు అతని గణ నంది ఎల్లప్పుడూ కాపలాగా ఉంటుంది. శివునికి సేవ చేస్తుంది. శివుడు తపస్సు చేస్తున్నప్పుడు అతనిని కలవడానికి ఎవరు వచ్చినా తమ కోరికలను నంది చెవుల్లో గుసగుసలాడుతూ చెప్పేవారు. నందిజీ చెవుల్లో భక్తులు చెప్పే కోరికలు నేరుగా పరమశివునికి చేరి నెరవేర్చేవాడు. అందుకే నేటికీ భక్తులు తమ కోరికలు తీర్చమంటూ నంది చెవిలో తమ కోరికలు చెబుతారని నమ్ముతారు. అయితే నందిశ్వరుడి చెవిలో మాటలు చెప్పడానికి కొన్ని నియమాలు కూడా ఉన్నాయి. నంది చెవిలో తమ కోరికలను చెప్పడానికి సరైన మార్గం ఏమిటో ఈ రోజున తెలుసుకుందాం.. నంది చెవిలో కోరికలు చెప్పడానికి సరైన మార్గం, నియమాలు ఏమిటంటే? ముందుగా శివుడిని, పార్వతిని పూజించండి. దీని తరువాత నందికి నీరు, పువ్వులు, పాలు సమర్పించండి. అనంతరం అగరబత్తీలు వెలిగించి నందికి హారతినివ్వండి. నందీశ్వరుడికి ఏ చెవిలోనైనా మీ కోరికలు చెప్పవచ్చు. అయితే ఎడమ చెవిలో కోరికలు చెప్పడం చాలా ఫలప్రదంగా పరిగణించబడుతుంది. నంది చెవిలో మీ కోరికను చెప్పే ముందు, "ఓం" అనే పదాన్ని ఉచ్చరించండి. ఇలా చేయడం వల్ల మీ కోరికలు శివునికి త్వరగా చేరుతాయని నమ్ముతారు.నంది చెవిలో మీ కోరికలు చెప్పేటప్పుడు.. ఏ కోరికను కోరబోతున్నారో దానిని మరెవ్వరూ వినకూడదని గుర్తుంచుకోండి. అందువల్ల కోరికను చాలా నెమ్మదిగా.. స్పష్టంగా నంది చెవిలో చెప్పండి. కోరికను చెప్పేటప్పుడు మీరు మీ రెండు చేతులతో మీ పెదవులను దాచుకోవాలి తద్వారా మీ కోరికను చెబుతున్న సమయమలో ఇతర వ్యక్తులకు ఆ కోరిక తెలియదు. నందిశ్వరుడి చెవుల్లో కోరికలు ఇతరులకు హాని కలిగించాలని లేదా తప్పు చేయాలని కోరుకోవద్దు. అంతేకాదు ఇతరుల గురించి చెడుగా మాట్లాడకండి. మీ కోరిక చెప్పిన తర్వాత ఖచ్చితంగా నందీశ్వర మా కోరిక తీర్చండి' అని విజ్ఞప్తి చేయండి. ఒక సమయంలో ఒక కోరిక చెప్పండి. అత్యాశకు లొంగిపోకం. ఒకేసారి అనేక కోరికలు కోరవద్దు.

## భక్తురాలి కొడుకుని బతికించిన క్షేత్రం.. ఈ జ్యోతిర్లింగం దర్శనంతో సంతానం లేని దంపతులకు సంతానం..

శివుని ద్వాదశ జ్యోతిర్లింగాలకు సంబంధించిన అద్భుత కథనాలు ఇప్పటికీ ఇక్కడి ప్రజలను ఆకర్షిస్తున్నాయి. భగవంతుని భక్తికి నిజమైన ఉదాహరణగా పిలువబడే పరమశివుని ఈ చివరి జ్యోతిర్లింగానికి సంబంధించిన కథ ఒకటి ఉంది. ఇక్కడ పరమశివుడు తన భక్తుడి కోరికను తిరిగి బతికించాడు. దీని కారణంగా సంతానం లేని ఏ జంట అయినా సంతానం కోసం ఈ జ్యోతిర్లింగ క్షేత్రాన్ని దర్శిస్తే త్వరలో ఆ దంపతుల కోరికను నెరవేరుస్తాడని నమ్మకం. జ్యోతిర్లింగ క్షేత్రం ఎక్కడ ఉందంటే..? ఈ జ్యోతిర్లింగ క్షేత్రం మహారాష్ట్రలోని దౌల్తాబాద్‌లోని బెరల్‌గావ్‌లో ఉంది. ఈ ఆలయాన్ని ఘుష్మేశ్వర జ్యోతిర్లింగ ఆలయం అని కూడా అంటారు. అజంతా, ఎల్లోరా గుహలకు సమీపంలో ఉన్న ఈ శివలింగం శివుని పట్ల భక్తులకు ఉన్న నిజమైన భక్తికి చిహ్నం. ఆ భక్తురాలి పేరు మీదుగా ఈ శివలింగానికి ఘుష్మేశ్వర అని పేరు వచ్చింది. ఘుష్మేశ్వర జ్యోతిర్లింగ క్షేత్రానికి సంబంధించిన పురాణ కథనం ప్రకారం దక్షిణ దేశంలోని దేవగిరి పర్వతం సమీపంలో సుధర్మ అనే బ్రాహ్మణుడు తన భార్య సుదేహాతో కలిసి నివసించేవాడు. ఈ దంపతులకు సంతానం లేదు. దీంతో ఇద్దరూ ఆందోళన చెందారు. అప్పుడు ఆ బ్రాహ్మణుని భార్య అయిన సుదేహ తన భర్తను తన చెల్లెలు ఘుష్మతో మళ్ళీ వివాహం చేసింది. ఘుష్మ గొప్ప శివ భక్తురాలు. పరమశివుని దయతో ఆమెకు ఆరోగ్యవంతమైన కొడుకు పుట్టాడు. అయితే సుదేహకు తన చెల్లెలు ఘుష్మా కుటుంబం నవ్వుతూ ఉండడం.. పిల్లాడితో ఆడుకోవడం చూసిన సుదేహలో తన చెల్లెలుపై అసూయ మొదలైంది. దీంతో ఘుష్మ బిడ్డను చంపి చెరువులో పడేసింది. భక్తురాలి కుమారుడిని మళ్ళీ బతికించిన శివుడు : ఈ విషయం తెలుసుకున్న ఘుష్మ ఎంతగానో దుఃఖించింది. అయితే శివుడికి పూజకు వేళ అవ్వడంతో తన దుఃఖాన్ని మరచి మళ్లీ యథావిధిగా శివపూజలో మునిగిపోయింది. మహాదేవుడు తన భక్తురాలి భక్తికి సంతోషించాడు. శివుని ఆశీర్వాదంతో ఘుష్మ కుమారుడు మళ్లీ బ్రతికాడు. లోక కల్యాణం కోసం ఈ ప్రదేశంలో శాశ్వతంగా నివసించాలని ఘుష్మ శివుడిని ప్రార్థించింది. శివుడు ఘుష్మ కోరికను అంగీకరించిన శివుడు జ్యోతిర్లింగ రూపంలో అక్కడ నివసించడం ప్రారంభించాడు. తాను ఇక్కడ ఎల్లప్పుడూ నివసిస్తాను.. నీ పేరుతో ఘుష్మేశ్వర్ అని పిలువబడుతూ పూజలను అందుకుంటాడు అని వరం ఇచ్చాడు.

# శ్రీ ఎస్ పి ఆర్ గ్లోబల్ స్కూల్ ఆధ్వర్యంలో ఘనంగా బోనాల పండుగ ఉత్సవాలు

**కుత్బుల్లాపూర్ జూలై 27 (వార్తాప్రభ)** : తెలంగాణ ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకునే బోనాల పండుగ సందర్భంగా శ్రీ ఎస్.పి.ఆర్ గ్లోబల్ స్కూల్ చైర్మన్ సొంటిరెడ్డి పున్నారెడ్డి ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సహకారంతో మన తెలంగాణ రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా జరుపుకునే బోనాల పండుగ యొక్క విశిష్టతను కళ్లకు కట్టేలా విద్యార్థులకు చూపించడానికి శ్రీ ఎస్.పి.ఆర్ గ్లోబల్ స్కూల్ లో బోనాల పండుగ ఎంతో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు చదువు, ఆటపాటలతోపాటు మన సాంస్కృతి సాంప్రదాయాలు కూడా తెలియజేయడం ఎంతగానో అవసరమని గట్టిగా నమ్మే శ్రీ ఎస్.పి.ఆర్ గ్లోబల్ స్కూల్ చైర్మన్ సొంటిరెడ్డి పున్నారెడ్డి, ఈ కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన రావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయని, ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలియజేశారు.



# రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైన విజయ జూనియర్ కాలేజ్ మరియు శ్రీ వివేకానంద డిగ్రీ కాలేజ్ విద్యార్థులు



**చల్లపల్లి/ అవనిగడ్డ: జులై 27(వార్తాప్రభ ప్రతినిధి)** ఆగస్టులో జరగనున్న రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ జూనియర్ , సీనియర్ విభాగాల్లో చల్లపల్లికి చెందిన విజయ జూనియర్ కాలేజ్ మరియు శ్రీ వివేకానంద డిగ్రీ కాలేజ్ విద్యార్థులు ఎంపికైయ్యారు. శనివారం ఘంటసాల మండలం గోగినేని పాలెం లో జరిగిన సాఫ్ట్ బాల్ జూనియర్ మరియు సీనియర్ జట్ల ఎంపికలో విజయ జూనియర్ కాలేజీ నుండి కృష్ణాజిల్లా జూనియర్ విభాగంలో వేమూరి గాయత్రి ,కట్ట శాంతి , గరికిపూడి హాసిని , పడమట దుర్గా తేజస్విని ,పడమట ధనుష్ , గురువింద పల్లి రవితేజలు ఎంపికయ్యారు.ఇదే విధంగా కృష్ణాజిల్లా సీనియర్ విభాగంలో శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాలకు చెందిన కొడాలి రేణు శ్రీ ,బుర్రె సాయి శ్రీ ,దివి లక్ష్మి లు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థినీ విద్యార్థులను కళాశాల సెక్రెటరీ %డ% కరస్పాండెంట్ యార్లగడ్డ శివప్రసాద్, డైరెక్టర్ యార్లగడ్డ చక్రధర్, శ్రీ వివేకానంద డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ పెమ్మసాని రమేష్ బాబు, విజయ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ షేక్ అబ్దుల్ రహీం , ఫిజికల్ డైరెక్టర్ కొడాలి చందు తదితరులు అభినందించారు.జిల్లాజట్టులో స్థానం సంపాదించిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో అద్భుత ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు.

# ఇల్లు కోల్పోయిన బాధితులకు న్యాయం చేయండి

## -ఎమ్మెల్యే గాంధీకి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి నేతృత్వంలో బాధితుల వినతి

**శేరిలింగంపల్లి,జూలై 27 (వార్తాప్రభ)**:గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని బసవతారక నగర్ లో ఇండ్లు కోల్పోయిన బాధితులకు న్యాయం చేయాలని కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆరెక పూడి గాంధీ ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించడం జరిగినది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, దృష్టికి మరియు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి తప్పకుండా సరైన న్యాయం చేస్తానని,అర్హులైన ప్రతి ఒక్కరికి తప్పకుండా న్యాయం చేస్థానాని,అధైర్య పడకూడదని,అన్ని విధాలుగా ఆదుకుంటామని,ఇదివరకు ఇండ్లు పొందిన వారి లాగే మిగతా వారికి కూడా ఇండ్లు వచ్చేలా చూస్తానని,అర్హులైన ప్రతి ఒక్కరికి తప్పకుండా న్యాయం చేస్తామని,అర్హులైన ప్రతి లబ్ధిదారులకు గృహ నిర్మాణ పథకాలలో వెంటనే లబ్ది చేకూర్చేలా ఆదుకుంటామని,అదేవిధంగా వారికి గృహ నిర్మాణం పథకాలలో కేటాయించేంత వరకు వారికి తాత్కాలికంగా వసతి మరియు ఇతర సదుపాయాలు కలిపించి వారికి సరైన న్యాయం చేకూర్చేలా చేస్తానని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు.మీకు ఎల్లవేళల అందుబాటులో ఉంటానని, ఎపుడైన కలవొచ్చు అని , సమస్యలు చెప్పుకోవచ్చు అన్ని ఎల్లవేళలో అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే గాంధీ తెలియచేసారు.



# బావిలో దూకి పంచాయతీ సెక్రెటరీ ఆత్మహత్య

## ▪ ఎస్సై కూచిపూడి జగదీష్



**తొర్రూరు జూలై 28 (వార్తా ప్రభ)**స్థానిక పట్టణ కేంద్రానికి చెందిన పంచాయతీ కార్యదర్శి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం తొర్రూర్ ఎస్సై కూచిపూడి జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం తొర్రూరు పట్టణానికి చెందిన పేర్ల వెంకన్న తండ్రి పేరు చిన్న బిక్షం వయసు 32 సంవత్సరాలు వృత్తి పంచాయతీ కార్యదర్శిగా దంతాలపల్లి మండలం లక్ష్మీపురం గ్రామంలో పనిచేస్తున్నాడని,ఇతను గత సంవత్సరం నుండి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ తన ఉద్యోగం పర్మినెంట్ కాలేదని బాధతో తేదీ 27 /7 2024 నాడు ఉదయం 11:30 గంటలకు సమయంలో తన ఇంటి నుండి బయలుదేరి వెళ్లి కంటాయిపాలెం రోడ్డులో గల బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు అని ఎస్సై తెలిపారు. మృతుని భార్య పేర్ల లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుంది తెలిపారు.

# అలరించిన కోవెల్లంపూడి తరణి భరతనాట్య, కథక్ ప్రదర్శనలు

**శేరిలింగంపల్లి,జూలై 27 (వార్తాప్రభ)**:మాదాపూర్ లోని శిల్పారామం లో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం భరతనాట్యం మరియు కథక్ నృత్య ప్రదర్శనలు ఎంతగవు అలరించాయి.కాలిఫోర్నియా, యు.ఎస్.ఏ నుండి విచ్చేసిన కుమారి





తరణి కోవెల్లంపూడి తన ప్రదర్శనలో విఘ్నారాజం భజే,ఎందరో మహానుభావులు, కళింగ నర్తనం అంశాలను చక్కని అభినయం తో ప్రదర్శించి మెప్పించింది.తరంగిణి కథక్ అకాడమీ గురు సుబ్రత్ సర్కార్ శిష్యబృందం కథక్ నృత్య అంశంలో గణేశా వందన,కృష్ణ వందన,తీన్ తాల్,సరస్వతి వందన, తుమ్రి,తరాన అంశాలను తనిష్క,అన్య,శీలాసింగ్, భావన,నేహా,శ్రియ,ఆరాధ్య, ఆంచల్ మొదలైనవారు ప్రదర్శించి మెప్పించారు.

# డెంగ్యూ పై ప్రజల్లో అవగాహన రావాలి

## -జ్యోతినగర్ లో లిల్లి మోడల్ హై స్కూల్ విద్యార్థుల ర్యాలీ




**మల్కాజిగిరి జూలై 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**: డెంగ్యూ పై ప్రజల్లో అవగాహన రావాల్సిన అవసరం ఉందని కోరుతూ శనివారం గౌతంనగర్ డివిజన్ జ్యోతినగర్ లో లిల్లి మోడల్ హై స్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని స్కూల్ కరస్పాండెంట్ షేక్ సయ్యద్ అహమ్మద్ , అజ్రా , కాలనీ కుమార్, ఏ. వీ స్వామి, కో ఆర్డినేటర్ రాధా, ఉపాధ్యాయులు జీవన్ బాబు, షాక్ మతీన్ అహ్మద్, పోలీస్ ప్రతినిధి వెంకటేశ్వర్ , ఆశా వర్కర్స్, జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఇంటింటికీ అవహగానా కల్పించే కరపత్రాలను పంపిణీ చేశారు. వ ర్యాలీలో 200 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు.

# తలాటం సేవలు అభినందనీయం- డా.చిట్ల కిరణ్

**కాకినాడ జూలై 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఆహా ఏమి రుచి... తినరా మైమరచి... అంటూ లొట్టలు వేసుకుంటూ తింటున్నారు.కాకినాడ డొక్కా సీతమ్మ అన్నపూర్ణాదేవి సేవా సంఘం క్రమం తప్పకుండా ప్రతి శనివారం నిర్వహిస్తున్న మంచి భోజనం కార్యక్రమంలో అందరూ పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వైద్యులు చిట్ల కిరణ్ ఆయన సతీమణి డా.రజిని చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డా.చిట్ల కిరణ్ దంపతులు మాట్లాడుతూ కాకినాడ డొక్కా సీతమ్మ అన్నపూర్ణాదేవి సేవా సంఘం ద్వారా ఆకలితో ఉన్న వారి ఆకలి తీర్చడం అభినందనీయం అన్నారు.ట్రస్టు ద్వారా ప్రతి శనివారం ఈ విధంగా కోటయ్య బూరి,అన్న వితరణ చేయడం అభినందనీయమనీ ఈరోజు కార్యక్రమంలో తాము పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని అన్నారు.ట్రస్టు ద్వారా ఇటువంటి మంచి కార్యక్రమం చేస్తున్న వ్యవస్థాపకులు తలాటం హరీష్, వారికి సహకరిస్తున్న సభ్యులందరికీ అభినందనలు తెలిపారు.ఈ అన్న వితరణలో నాలుగు రకాల స్వీట్లు, ఫ్రైడ్ రైస్, పులిహార, రెండు కూరలు,పెరుగుతో హరీష్ స్పోర్ట్స్ అధినేత తలాటం హరీష్ స్నేహితులు,వారి సిబ్బంది కలిసి అన్నదానానికి హాజరైన ప్రతి ఒక్కరికి దగ్గరుండి వడ్డించారు. కోటయ్య స్వీట్స్ అధినేత రామ్ కుమార్ పినిశెట్టి సురేష్,కరప తాతయ్యలు,అన్నదానానికి సహకరించారు. సర్వసాధారణంగా అన్నదానం కార్యక్రమం అంటే వచ్చిన వారికి ఆకలి తీర్చే విధంగా ఏర్పాటు చేస్తారు. అయితే ఇక్కడ ప్రత్యేకత ఏమిటంటే అందరికీ విందు భోజనం మాదిరిగా మంచి భోజనాన్ని అందిస్తున్నారు. సుమారు 200మంది ఈ అన్నదాన కార్యక్రమం సంతృప్తిగా విందు ఆరగించి సంతోషం వ్యక్తం చేశారు.వచ్చే శనివారం యదావిధిగా ఈ అన్న వితరణ జరుగుతుందని ట్రస్టు నిర్వాహకులు తలాటం హరీష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కాకినాడ జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మంగా వెంకట శివ రామకృష్ణ,ఫౌండేషన్ సభ్యుడు, సానా సతీష్ బాబు,వీరబాబు,సురేష్,హరీష్ స్పోర్ట్స్ శీను,చార్లీ,కృష్ణవేణి, పాల్గొన్నారు.



# అగస్త్యేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ సమావేశం



**పెడన , జూలై 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పట్టణం లోని శ్రీ గంగా పార్వతి సమేత అగస్త్యేశ్వర స్వామి వేణుగోపాల స్వామి వార్ల దేవస్థానం ఆలయ ప్రాంగణము యందు అభివృద్ధి కమిటీ చైర్మన్ బళ్ల ప్రసాద్ అధ్యక్షతన శనివారం సాదారణ సమావేశం ఏర్పాటు చేయడం జరిగినది. ప్రధానంగా రశీదు పుస్తకాలు మరియు బ్యాంక్ ఖాతా పుస్తకాలను స్వామి వారి వద్ద ప్రత్యేక పూజలు జరిపి స్వామి వారి ప్రాశస్త్యం తెలుపు సమాచారం మరియు భక్తుల సౌకర్యార్థం విరాళాలు బ్యాంక్ వివరాలుతో కూడిన ఖాతా నంబర్ మరియు సభ్యుల ఫోన్ నెంబర్లను తెలిపే బ్యానర్ ను ఆలయ ప్రాంగణము యందు భక్తుల సౌకర్యార్థం ఆవిష్కరించడం జరిగినదితదనంతరం అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా స్వామి వారి వెండి తాపడం ఇతర అభివృద్ధి విషయాలు గురించి చర్చించగా ప్రత్యేక ఆహ్వానితులుగా బొడ్డు దీక్షనందు విధి విధానాలు తెలుపగా కోశాధికారి ఉటుకూరు సూర్య ప్రకాశరావు బ్యాంక్ ఖాతా గురించి అందరి సభ్యులు పాటించాల్సిన నియమాలు గురించి వివరించడం జరిగింది... మిగిలిన సభ్యులు వారి సలహాలు సూచనలు ఇతర అభివృద్ధి విషయాలు గురించి చర్చించడం జరిగింది ఈ కార్యక్రమానికి సభ్యులు సింగరాజు ప్రకాశరావు శ్రీనివాస్ వీణం జక్కుల చిన బసవేశ్వరరావు కూనపరెడ్డి శ్రీనివాస రావు యర్రపోతు నాగేశ్వర రావు తమ్మ భీమయ్య భూసం.అగస్టయ్య దివి పైడి రాజు కొత్త నవీన్ గూడూరు అగస్తయ్య మరియు ఇతర మిత్రులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేసినారు....

# కొత్తపేట ఎస్ ఐ కి కోనసీమ ప్రాంతానికి బదిలీ

## ఘనంగా వీడ్కోలు పలికిన వెస్ట్ జోన్ ఏ సి పి,...సి ఐ, సహచర సిబ్బంది

**విజయవాడ పశ్చిమ జూలై 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సాధారణ ఎన్నికలలో భాగంగా కోనసీమ జిల్లా నుంచి ఎస్సై సీతారామాచార్యులు విజయవాడ సిటీ టూ టౌన్ (కొత్తపేట) పోలీస్ స్టేషన్ ఈ ఏడాది ఫిబ్రవరి 6 తేదీన వచ్చారు.2024 ఎలక్షన్స్ విధులను దిగ్విజయంగా నిర్వహించడాని కి తన విధులు సమర్ధవంతంగా నిర్వహించారు. 6 నెలలు సమర్థవంతంగా విధులు నిర్వహించి మంచి గుర్తింపు పొందిన ఆయన మళ్లీ తిరిగి అంబేద్కర్ కోనసీమ జిల్లా వెళుతున్న సందర్భంగా వెస్ట్ ఏసిపి మురళికృష్ణారెడ్డి , టూ టౌన్ సి ఐ తిప్పా గణేష్ ఎస్ ఐ నరేంద్ర మరియు టూ టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది అందరూ ఘనంగా సత్కరించి సెండాఫ్ ఇచ్చారు.కాగా అతి తక్కువ కాలంలో పని చేసినా తన సహచర సిబ్బంది అందరూ ఇంత గొప్పగా తనకు ఎంతో ఆప్యాయంగా ఇంత ఘనంగా సన్మానించడం తన అదృష్టమని సన్మాన గ్రహీత సీతారామాచార్యులు కృతజ్ఞతలు తెలిపారు.



# చిట్టినగర్ కొండ ప్రాంతం పై చిట్టచివర ఆఖరి మెట్టు వరకు ఎక్కి సమస్యల పరిశీలన

## ఏ సి కార్యాలయందాటి క్షేత్ర స్థాయిలో సమస్యల పరిష్కారానికి నడుం బిగిస్తూ....ముందుకు

## విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం ఐఏఎస్

**విజయవాడ పశ్చిమ జూలై 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర శనివారం ఉదయం తన పర్యటనలో భాగంగా చిట్టినగర్ కొండ ప్రాంతం లోగల రాయప్పరాజు స్ట్రీట్, రామాలయం స్ట్రీట్, టానర్ పేట, గుజ్జారి ఎల్లారావు మార్కెట్ సముదాయం, డాక్టర్ కెఎల్ రావు పార్క్, డాక్టర్ కేఎల్ రావు స్విమ్మింగ్ పూల్ ప్రాంతాలు మొత్తం పర్యటించి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఏ సి కార్యాలయం దాటి వందలాది మెట్లు ఎక్కుతూ దిగుతూ ముందుకు కదిలిన మున్సిపల్ కమిషనర్ముందుగా 48వ డివిజన్లో గల రాయప్ప వీధి ప్రాంతం మొత్తం పరిశీలించి, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరగాలని, సైడ్ కాలువల్లో పూడికలు ఎప్పటికప్పుడు తీసేయడమే కాకుండా, డ్రైన్ మ్యాప్ ల ద్వారా ఏ పూడికలు తీసుకుంటున్నారో ఆ పూడికలను మార్క్ చేసుకొని, సైడ్ డ్రయిన్ల ప్రవాహం మ్యాప్ ద్వారా తెలుసుకుంటూ సైడ్ కాలవల్లోని పూడికలసమస్యలను పరిష్కరించవచ్చని, ప్రజారోగ్య అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.తన పర్యటనలో పరిశీలించిన బిల్డింగ్ మరియు చెట్టు వ్యర్థాలు గమనించి ఎప్పటికప్పుడు టౌన్ ప్లానింగ్, శానిటేషన్, సెక్రటరీలు మరియు హార్టికల్చర్ విభాగం సమన్వయంతో వ్యర్థాలను తొలగిస్తూ పారిశుద్ధ నిర్వాహణ మెరుగుపరచాలని అన్నారు. తదుపరి గుజ్జారి యెల్లా రావు మార్కెట్ సముదాయం పర్యటించి పరిశుద్ధ నిర్వాహన సక్రమంగా జరగాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.ఆ పిమ్మట డాక్టర్ కే ఎల్ రావు పార్క్ సందర్శించి అక్కడ వాకింగ్ ట్రాక్కు, పార్క్ అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పార్క్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏ ఎస్ ఎన్ ప్రసాద్ కు ఆదేశాలు ఇచ్చారు. డాక్టర్ కే ఎల్ రావు స్విమ్మింగ్ పూల్ పరిశీలించిన కమిషనర్, ఒలంపిక్స్ విజయాలు సాధించే విధంగా కోచింగ్ ఇవ్వాలని, దానికి తగ్గట్టుగా సమయాన్ని కేటాయించి కోచింగ్ ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ పర్యటనలో విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర తో పాటు అడిషనల్ కమిషనర్ జనరల్ డాక్టర్ ఏ మహేష్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి రత్నావళి, జోనల్ కమిషనర్ 1 రమ్య కీర్తన, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ 1 ఏ ఎస్ ఎన్ ప్రసాద్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబా శ్రీనివాస్, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబాబు, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీస్ రజియ షబిన, సానిటరీ సూపర్వైజర్ ఓబేశ్వరరావు, అసిస్టెంట్ ఇంజనీర్లు, సానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయం సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.



# బాలలను ఉన్నత ఆశయాల వైపు తీర్చిదిద్దాలి

## - జిల్లా ప్రధాన న్యాయమూర్తి!!! - బాలల సంక్షేమమే పరమావధి



**మచిలీపట్నం జూలై 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)** నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్తు అని, వారిని ఉన్నత ఆశయాల వైపు వారి బాల్యం నుంచే తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ అరుణాసారిక అన్నారు.శనివారం మచిలీపట్నంలోని జిల్లా పోలీస్ కార్యాలయం స్పందన కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక జువనైల్ పోలీస్ యూనిట్ల సభ్యులకు బాలల హక్కుల న్యాయ చట్టాలపై నిర్వహించిన శిక్షణా తరగతులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణాసారిక ముఖ్య అతిథిగా పాల్గొని శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ దేశ జనాభాలో దాదాపు 25 శాతం ఉన్న బాలల హక్కుల పరిరక్షణకు ఎన్నో చట్టాలు ఉన్నాయన్నారు. ఉచిత నిర్బంధ విద్య, ఆరోగ్య పరిరక్షణ, మానవ అక్రమ రవాణా నిషేధం, వెట్టి చాకిరి నిర్మూలన, బాల బాలికలపై అకృత్యాల రక్షణ చట్టం (పోక్సో చట్టం), బాలల న్యాయం, బాల కార్మిక నిర్మూలన వంటి చట్టాలు బాలల సంక్షేమం, ప్రయోజనాలను సంరక్షించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించాయని తెలిపారు. బాలల సంక్షేమమే పరమావధిగా "ప్రత్యేక జువనైల్ పోలీస్ యూనిట్లను" ఏర్పాటు చేసి ఆయా చట్టాలపై జిల్లా, గ్రామస్థాయిల్లో శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు న్యాయ సేవాధికార సంస్థలను ఆదేశించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ప్రత్యేక జువనైల్ పోలీస్ యూనిట్ల సభ్యులకు బాలల న్యాయ చట్టాల పట్ల మరింత అవగాహన కలిగించేందుకు శిక్షణా తరగతులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ శిక్షణాకాలంలో అనేక విషయాలను తెలుసుకుని వాటిని విధి నిర్వహణలో అమలుపరిచే విధంగా బాలల పరిరక్షణకై పాటుపడాలని కోరారు. జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు మాట్లాడుతూ తల్లిదండ్రుల బాధ్యతారాహిత్యం, కుటుంబ, సామాజిక, ఆర్థిక పరిస్థితులు, చెడు స్నేహాల ప్రభావంతో సమాజంలో బాలలు నేరప్రవృత్తి వైపు పయనించేందుకు ఎక్కువ ఆస్కారం ఉందని, బాలలు సన్మార్గంలో పయనించేందుకు తల్లిదండ్రులు, బంధువులు, టీచర్ల ప్రత్యేక శ్రద్ధ ఎంతో అవసరం అన్నారు. బాలల న్యాయ చట్టాలపై పూర్తి అవగాహన కలిగించుకుని వారిని సమాజానికి విలువైన వారిగా తయారు చేసేందుకు కృషి చేయాలని కోరారు. జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని పాఠశాలలు, కళాశాలలో మత్తు పదార్థాల సేవనం దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి చిన్నంశెట్టి రాజు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.వి రామకృష్ణయ్య, మచిలీపట్నం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అశోక్ కుమార్, గవర్నమెంట్ అబ్జర్వేషన్ హోమ్ సూపరింటెండెంట్ పి రామ్మోహన్ రెడ్డి, హెల్ప్ ఎన్జీవో సెక్రెటరీ ఎమ్మెస్ రామ్మోహన్, ఇతర పోలీసు అధికారులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ బ్యాగులను వాడవద్దంటూ అవగాహన ర్యాలీ




**విజయవాడ పశ్చిమ, జూలై 27: (వార్తా ప్రభ ప్రతినిధి)** పర్యావరణానికి హాని చేసే ప్లాస్టిక్ బ్యాగులను వాడవద్దని అవగాహన కల్పిస్తూ సఫాయి కర్మచారి వెల్ఫేర్ అసోసియేషన్ అండ్ ట్రీస్ గ్రూప్ ఆధ్వర్యంలో వన్ టౌన్ లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వాహకులు మాట్లాడుతూ ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, ప్లాస్టిక్ వస్తువులు పర్యావరణానికి ఎంతో హాని చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ రహిత దేశంగా మన దేశాన్ని చక్క దిద్దుకోవడం అవసరమని వారు అన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు బండి కాళేశ్వరరావు, తుపాకుల రమణమ్మ, బంగారు శివ నాగరాజు, విశ్వం శెట్టి లక్ష్మీనారాయణ ,కొమర ఎల్లారావు, పాలెపు శివకుమార్, రేఖ ,చొక్కాకుల రమేష్ ,సింగంపల్లి దుర్గారావు, విశ్వం శెట్టి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం సందర్భంగా బిజెపి నేతల నివాళులు



**ఇబ్రహీంపట్నం జూలై 27(వార్తా ప్రభ ప్రతినిధి:-**మాజీ భారత రాష్ట్రపతి మిస్సైల్ మ్యాన్ ఏపీజే అబ్దుల్ కలామ్ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించారు బిజెపి నేతలు. కొండపల్లి కృష్ణ చేతన్ స్కూల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ మారాసు కృష్ణ మోహన్, కొండపల్లి మున్సిపాలిటీ అధ్యక్షులు చల్లా ఆంజనేయులు అధ్యక్షతన వహించారు.ఈ అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా చిగురుపాటి లక్ష్మి మాట్లాడుతూ కలం చిన్నతనం నుండి కష్ట పడి చదువుకొని ,పేపర్ బాయ్ గా పనిచేసి సైటిస్ట్ గా దేశం కోసం సేవ చేశారని తెలిపారు.రాష్ట్రపతి గా దేశ ఖ్యాతి పెరిగేలాగా సేవలు అందించారన్నారు.అణు ఆయుధాలు, మిస్సెల్స్ తయారీ కోసం కృషి చేశారు,చిన్నపిల్లలు అంటే అమితమైన ప్రేమ అభిమానం చూపేవారు తను చనిపోయేవరకు దేశం కోసం ధర్మం కోసం పనిచేశారు అని తెలిపారు. ఈ కార్యక్రమం లో తుమ్మల శ్రీ కుమార్, పాండు, రంగారావు,ఉప్పుతల సత్యం, సూరజ్ ,స్కూల్ ప్రిన్సిపాల్ మల్లికార్జునరావు, నాయకులు,ఉపాధ్యాయ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# పత్తి పంటకు పచ్చదోమ తో తీవ్ర నష్టం

## పచ్చదోమ నివారణ పై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ



**ఇబ్రహీంపట్నం జూలై 27 (వార్తా ప్రభ ప్రతినిధి):-**మండల పరిధిలోని దాములూరు గ్రామంలో శనివారం నాడు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా వనరుల కేంద్రం విజయవాడ వ్యవసాయ సహాయ సంచాలకులు పి మనిషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు పండిస్తున్న మినిము,పత్తి పంటలను సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ పత్తి పంటలో రసం పీల్చు పచ్చ దోమ పురుగు అత్యంత ప్రమాదకరమని, ఇది ఆకు అడుగుభాగంలో చేరి ఆకునుండి రసం పిలుస్తాయని, దానివల్ల ఆకులు ఎర్ర పడి ఎండకు రాలిపోతాయని తెలిపారు. పురుగు తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు మొక్క ఎదుగుదల క్షమించి దిగువలకు తీవ్ర నష్టం ఏర్పడుతుందని అన్నారు. దీని నియంత్రణకు ప్రతి పంటలో అంతర పంటగా పెసర,మినుము,కొర్ర వంటి పంటలను సాగు చేయడం ద్వారా పాత్ర పురుగు ఏర్పడి పచ్చ దోమ ఉధృతిని నివారించవచ్చని తెలిపారు. పంట కు 30-40 రోజులకు మోనోక్రోటోఫాస్ 1పాళ్లు,4 పాళ్ల నీళ్లు, 60 రోజులకు ఇమీడాక్లప్రిడ్ 1 పాళ్లు, 20 పాళ నీరు కలిపి కాండం పూత పద్ధతి పాటించాలని, అదేవిధంగా వేప గింజల కషాయం, వేప నూనె పచ్చదోమ నివారణకు ఎంతో ఉపయోగపడతాయని వివరించారు. అంతేకాకుండా మినుము పంట పూత దశకు వస్తుంది కనుక వేపనునే పిచికారి చేయడం వలన మార్కాపచ్చల పురుగును సైతం నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని శైలజ గ్రామ సర్పంచ్ మధుసూదన్రావు, గ్రామ వ్యవసాయ సహాయకుడు నరేంద్రనాయక్,రైతులు పాల్గొన్నారు.

# ఎం.ఈ.ఓ. కి వినతి పత్రం అందించిన మధ్యాహ్నం భోజనం కార్మికుల యూనియన్.



**వీరులపాడు జూలై 27: (వార్తా ప్రభ ప్రతినిధి) -** మండల పరిధిలోని, జుజ్జూరు కేంద్రంలో ఉన్న ఎంఈఓ కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ అధ్యక్షురాలు వుల్లమ్మ ఆధ్వర్యంలో ఎంఈఓ కి వినతిపత్రం అందించారు. మధ్యాహ్న భోజనం యూనియన్ నాయకురాలు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా మధ్యాహ్న భోజన కార్మికురాలుగా పనిచేస్తున్న పలువురిని మండలంలో రాజకీయ కారణాలతో బలవంతంగా రాజీనామా చేయించడం జరిగిందని తిరిగి వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో జీవితాన్ని గడుపుతున్న మధ్యాహ్నం భోజన కార్మికుల పొట్టకోటోటడం రాజకీయ నాయకులకు తగదని విమర్శించారు. మధ్యాహ్న భోజన కార్మికులకు సిఐటియు అనుబంధ సంఘాలు సంఘీభావం తెలిపాయి.వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్నం భోజన కార్మికులను తొలగించడం సరికాదని తొలగించిన వారిని వెంటనే వీధిలోకి తీసుకోకపోతే సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపడుతామని వారు తెలిపారు.

# జనసేన సభ్యత్వానికి మంచి ప్రజాదరణ

## జనసేన నగర ప్రధాన కార్యదర్శి లింగం శివప్రసాద్ వెల్లడి

**విజయవాడ పశ్చిమ, జూలై 27: (వార్తా ప్రభ ప్రతినిధి)** జనసేన క్రియాశీల సభ్యత్వానికి ఎల్లెడలా మంచి ప్రజాదరణ లభిస్తోందని జనసేన విజయవాడ నగర ప్రధాన కార్యదర్శి లింగం శివప్రసాద్ చెప్పారు. శనివారం స్థానిక 45 డివిజన్లోని సితార సెంటర్ వద్ద జనసేన క్రియాశీల సభ్యత నమోదు కార్యక్రమం లింగం శివప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆశయాల పట్ల ప్రజల్లో మంచి ఆదరాభిమానాలు కనబడుతున్నాయని చెప్పారు. జనసేన క్రియాశీల సభ్యత్వం తీసుకుంటే ఐదు లక్షల రూపాయల విలువైన ప్రమాద బీమా లభిస్తుందని, శాశ్వత పూర్తి వైకల్యం సంభవిస్తే 5 లక్షల రూపాయలు ,అలాగే పాక్షిక శాశ్వతవైకల్యం సంభవిస్తే 2.5 లక్షలు,అలాగే ఏదైనా ప్రమాదంలో గాయాలపాలైతే 50 వేల రూపాయల మేర హాస్పిటల్ కు సంబంధించిన ఖర్చులు కూడా భీమా రూపంలో వస్తాయని చెప్పారు. జనసేన క్రియాశీల సభ్యత్వం కోసం యువతి యువకులు పెద్ద సంఖ్యలో ముందుకు రావడం అభినందనీయమని శివ ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మర్రి శివకృష్ణ, తంగా రవికుమార్ , పెద్ది రెడ్ల సతీష్ ,మనుకొండ పాపారావు, సిరిపురం జోషి కిరణ్, మనుకొండ సాయికుమార్, సంకాబత్తుల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



# జాబ్ మేళా లో 142 మంది ఉద్యోగాల కు ఎంపిక

**మైలవరం జూలై 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**:స్థానిక డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్టీఆర్ జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్తా ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాబ్ మేళా లు 142 మంది వివిధ ఉద్యోగాల కు ఎంపిక అయినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఇళ్ళ రవి తెలిపారు.ఈ జాబ్ మేళా లో సుమారు 20 కంపెనీల ప్రజాప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారని తెలిపారు.వివిధ గ్రామాల నుంచి 271 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూ కి హాజరు కాగా తొలివిడతగా 142 మంది ఉద్యోగాలకు ఎంపికలు అయ్యారన్నారు మరో 79 మంది కి తరువాత ముఖాముఖి నిర్వహించి ఎంపిక చేస్తామని జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి డా.పి.నరేష్ కుమార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో సి పి డి సి సభ్యులు గోగులమూడి సాంబశివరెడ్డి, జెడ్ నాగిరెడ్డి,దేవరపల్లి సీతారామిరెడ్డి, కళాశాల ప్లేస్మెంట్స్ ఆఫీసర్ డా.ఎన్. వెంకటాద్రి, కళాశాల సిబ్బంది, ఏపీ ఎస్ఎస్డిసి సిబ్బంది పాల్గొన్నారు.



## ఆంధ్రప్రదేశ్ కోఆపరేటివ్ బ్యాంక్ ఉద్యోగుల అసోసియేషన్ ప్రధానకార్యదర్శిగా గోపీనాథ్



**నెల్లూరు, జూలై 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఆంధ్ర ప్రదేశ్ కోపరేటివ్ బ్యాంకుల ఉద్యోగుల అసోసియేషన్ కేంద్రకమిటీ సమావేశం ఈ రోజు నెల్లూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆవరణ లో జరిగింది. రాష్ట్ర అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో త్వరలో జరుగబోయే వేజ్ రివిజన్ పై చర్చించారు. రాష్ట్ర మహా సభ నిర్వహించడానికి తేది మరియు వేదిక నిర్ణయించడానికి చర్చించారు. ఇటీవల అసోసియేషన్ లో ఖాళీ ఏర్పడిన ప్రధాన కార్యదర్శి పదవికి నూతన ప్రధాన కార్యదర్శి గా కృష్ణా డిసిసిబి కి చెందిన సనకా గోపీనాథ్ ను కోఆప్షన్ ద్వారా ఎన్నుకున్నారు. తదుపరి ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు తాతిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, ముఖ్య సలహాదారు భోగాది శ్యామ్ ప్రసాద్,మరియు 9 జిల్లాల ప్రతినిధులు ఎన్.వి.వి. శ్రీనివాసరావు,ఆర్.వి. కృష్ణారెడ్డి, ప్రతాప్ రెడ్డి, కె కుమార్ పాల్, మురళీ మోహన్ రావు, మూసా షరీఫ్, కృష్ణా రెడ్డి(ఒంగోల్) మరియు ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.కార్యక్రమానికి జిల్లా యూనియన్ అధ్యక్షురాలు సుష్మా రెడ్డి అధ్యక్షత వహించారు.నెల్లూరు డిసిసిబి ఉద్యోగుల యూనియన్ ప్రధాన కార్యదర్శి హరి వందన సమర్పణ చేశారు.

## 77 మంది మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్స్ పంపిణి



**జి.కొండూరు:జూలై 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వికసిత్ భారత్ కార్యక్రమాలలో భాగంగా ప్రధానమంత్రి ఉజ్వలయోజన పథకం ద్వారా జి.కొండూరు గ్రామ పంచాయితీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం 77 మంది మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్స్ పంపిణీ చేశారు.ది భాగ్యలక్ష్మి ఇండియన్ గ్యాస్ ఏజన్సీస్ ఆగిరిపల్లి మేనేజింగ్ పార్టనర్ పాలడుగు వెంకట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్యాస్ కనెక్షన్స్ పంపిణీ కార్యక్రమాలను నిర్వహించారు.జి.కొండూరు మండల వ్యాప్తంగా మొత్తం 550 మంది లబ్ధిదారులకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్స్పంపిణీ చేయడం జరిగిందని భారతీయ జనతా పార్టీ(బిజెపి) ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు కొల్లి నాగేశ్వరరావు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ, గ్రామ సర్పంచ్ మండల అరుణ, తెలుగుదేశం పార్టీ నాయకులు పజ్జూరు రవి కుమార్ (వెంకయ్య),వుయ్యూరు వెంకట నరశింహారావు,పజ్జూరు శ్రీనివాసరావు, జనసేన పార్టీ నాయకులు బత్తిన శ్రీనివాసరావు,వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

## హెపటైటిస్ పై నిమ్రా ఫార్మసి విద్యార్థుల అవగాహన సదస్సు

**ఇబ్రహీంపట్నం జూలై 27(వార్తా ప్రభ ప్రతినిధి):**–స్థానిక నిమా ఫార్మసి కళాశాల ఫార్మడి ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల బృందం శనివారం నాడు ఇబ్రహీంపట్నం, కొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మరియు మూలపాడు జడ్పీహెచ్ హై స్కూల్ లో వరల్డ్ హెపటైటిస్ డే సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. డా బరుచా బ్లంబర్ పుట్టినరోజు సందర్భంగా వరల్డ్ హెపటైటిస్ జరుపుకుంటారు. ఈ కార్యక్రమంలో నేటి ఆధునిక యుగంలో ప్రపంచంలో హెపటైటిస్ వలనఈ ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుందని, ముఖ్యంగా దేశంలో ఈ సంఖ్య మరింత ఎక్కువ ఉందని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) గ్లోబల్ హెపటైటిస్ రిపోర్ట్ లో ఈ విషయం వెల్లడించారు అన్నారు. 2022 కోవిడ్ 19 తరువాత అత్యధిక మరణాలు సంభవించాయని,ముఖ్యంగా హెపటైటిస్, టి.బి. కారణంగానే ఈ మరణాలు జరిగినట్లు సర్వేలు తెలుపుతున్నాయన్నారు. ఈ సదస్సు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారిని డాక్టర్ పద్మావతి, డాక్టర్ శిరీష, డాక్టర్ ఫర్వీన్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జనార్దన్, కోలా హైమావతి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## వైసీపీ కి రాజీనామా చేసిన మైలవరం సర్పంచ్ మంజు భార్గవి



**మైలవరం :జూలై 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎన్టీఆర్ జిల్లా,మైలవరం గ్రామ సర్పంచ్ గరికపాటి మంజు భార్గవి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు శనివారం ప్రకటించారు.ఆ పార్టీ మండల అధ్యక్షుడు గర్నేపూడి వెంకట్రావు కు రాజీనామా లేఖను అందజేయనున్నట్లు సర్పంచ్ మంజు భార్గవి తెలియజేశారు.తదుపరి కార్యాచరణ త్వరలో తెలియజేస్తానని సర్పంచ్ వెల్లడించారు.

# జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం- మంత్రి కొల్లు రవీంద్ర!!!

### జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు!!!






**మచిలీపట్నం జూలై 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా స్వచ్ఛమైన పాలన అందించి, ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకుంటూ జిల్లాను నెంబర్ వన్ స్థానంలో నిలబెడదామని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.కృష్ణాజిల్లా ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం శనివారం స్థానిక జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో జడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో తొలుత మంత్రి మాట్లాడుతూ జిల్లాలో నూతనంగా ఎన్నికైన శాసన సభ్యులకు అభినందనలు, జడ్పిటిసి, ఎంపీపీ ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరపున శుభాకాంక్షలు. ఎన్నో ఆశలతో ఎన్నో బాధల నుండి బయట పడాలని ప్రజలు 95% మాండేట్ ఇచ్చి గురుతర బాధ్యత మాపై ఉంచారని అన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో 16 కు 16 స్థానాలు కూటమి ప్రభుత్వానికి ఇచ్చారని అన్నారు. వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాల్సిందని, బందరు పోర్టు పనులు వేగంగా పరిగెత్తించాలని, బిపిసిఎల్ కంపెనీ మన ప్రాంతంలో 60 నుండి 70 వేల కోట్ల పెట్టుబడులతో రిఫైనరీ ఏర్పాటుకు ముందుకు వస్తున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకుంటూ సంక్షేమ పాలన అందించాలని, అందుకు ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు సహకరించాలని, జిల్లాను నెంబర్ వన్ స్థానంలో ఉంచడానికి సంయుక్తంగా కృషి చేద్దామన్నారు. సభను ప్రారంభించిన జిల్లా పరిషత్ చైర్పర్సన్ మాట్లాడుతూ జిల్లాలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు ముఖ్యంగా గ్రామీణాభివృద్ధిలో రోడ్లు తాగునీరు సమస్యలు పరిష్కరిస్తూ 15వ ఆర్థిక సంఘం నిధులతో అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. మహిళల స్వావలంబన కోసం కుట్టు మిషన్లు వంటి వాటిని అందించి వారి జీవనోపాధికి తోడ్పాటు ఇస్తున్నట్లు తెలిపారు నూతనంగా ఎన్నికైన పార్లమెంటు సభ్యులు శాసనసభ్యులు, సమన్వయంతో జిల్లా అభివృద్ధి పథంలో నడుపుటకు కృషి చేస్తామన్నారు. జిల్లాలో నూతనంగా ఎన్నికైన అవనిగడ్డ, పామర్రు, గన్నవరం, గుడివాడ, పెడన శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్, వర్ల కుమార్ రాజా, యార్లగడ్డ వెంకట్రావు, వెనిగండ్ల రాము, కాగిత కృష్ణ ప్రసాద్ సభలో మాట్లాడుతూ వారి వారి నియోజకవర్గాల్లో సమస్యలు ప్రస్తావించి పరిష్కార చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సభ్యులు ప్రస్తావించిన సమస్యలపై వెంటనే పరిష్కార చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వ్యవసాయం, విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, రహదారులు తదితర అజెండా అంశాలపై సమావేశంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులచే సమాధానాలు ఇప్పించి, సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మంత్రి, జడ్పీ చైర్ పర్సన్, జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆయా మండలాల్లో తాగునీటి సమస్యలపై సభ్యులు లేవనెత్తిన అంశాలపై పరిష్కార చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. జిల్లాలో 7 నియోజకవర్గాల్లో జలజీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి మంచినీటి కులాయి అందించే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుత వర్షాకాలంలో గ్రామాల్లో ఫాగింగ్ చేయడం నీటి నిల్వ కుంటల్లో డ్రైన్లలో ఆయిల్ బాల్స్ చల్లాలని తద్వారా దోమల నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల భవనాలు లేని చోట్ల మంజూరు చేయాలని, పాఠశాలల్లో టాయిలెట్స్ వంటి మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయాలని ఆట స్థలం సమస్యలు ఉంటే పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. గత ఏడాది కంటే ఈ ఏడాది పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. వ్యవసాయ, ఇరిగేషన్ అంశాల్లో జరిగిన చర్చలో జిల్లాలో కాలువలు, మురుగు కాలువల్లో గుర్రపు డెక్క, తూడు తొలగింపు పనులు ఇంతవరకు చేపట్టకపోవడంవల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు ప్రస్తావించగా, వచ్చే ఏడాది నుంచి ముందుగానే కాలువల నిర్వహణ పనులు, మురుగు కాలువలలో సిల్టు తొలగింపు పనులు చేపట్టేలా చూస్తామని మంత్రి, జిల్లా కలెక్టర్ అన్నారు. ప్రైవేటు స్కూళ్లలో 25% సీట్లు పేదలకు కేటాయించేలా ప్రభుత్వ ఉత్తర్వులు అమలు కావడం లేదని సభ్యులు ప్రస్తావించగా, ఫీజు రెగ్యులేషన్ కమిటీలను యాక్టివేట్ చేయాలని, ప్రభుత్వ పథకాలు గురించి ప్రజాప్రతినిధులకు ముందుగా తెలియజేయాలని జడ్పీ చైర్ పర్సన్ అధికారులను ఆదేశించారు. జడ్పీటీసీలు వచ్చే ఆగస్టు 15 తేదీన జెడ్పి పాఠశాలల్లో జాతీయ జెండా ఎగరవేయడానికి ఆదేశాలు ఇవ్వాలని కోరగా రాష్ట్రస్థాయిలో ఈ అంశంపై చర్చిస్తామని మంత్రి అన్నారు. తొలుత భారత మాజీ రాష్ట్రపతి అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మంత్రి జడ్పీ చైర్పర్సన్, కలెక్టర్, శాసనసభ్యులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జడ్పీ సీఈవో ఆనంద కుమార్ తొలుత సభకు స్వాగతం పలికి అజెండా అంశాలు వివరించారు. ఈ సమావేశంలో కృష్ణ, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల జడ్పిటిసిలు, ఎంపీపీలు, 3 జిల్లాల వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఆర్థికంగా, అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న కుటుంబానికి చేయూత

### విజయవాడ పశ్చిమ నియోజకవర్గం తెలుగుయువత నాయకుడి ఆర్థిక సహాయం



**విజయవాడ పశ్చిమ జూలై 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ 48వ డివిజన్ ఆంజనేయ వాగు సెంటర్ కి చెందిన కొరికాని ఫణీంద్ర కు అనారోగ్యం మరియు వారి ఫ్యాన్సీషాపు వ్యాపారంలో నష్టంతో రోజులు గడవక చిన్న పిల్లలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున... ఎన్టీఆర్ జిల్లా తెలుగు యువత సెక్రటరీ పైలా సతీష్ మానవతా దృక్పథంతో స్పందించి వారికి చేయూత అందించారు. కొరికాని ఫణీంద్ర– రేవతి దంపతులకు వారి వ్యాపార అభివృద్ధి మరియు పోషణ నిమిత్తం హ రూ.20,000/–(ఇరవై వేల రూపాయలు) ఆర్థిక సహాయం,45 రోజులకు సరిపడా నిత్యవసర సరుకులను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్ చేతుల మీదుగా ఆర్థిక సహాయం అందించారు.ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా టిడిపి కార్యాలయ కార్యదర్శి సారేపల్లి రాధాకృష్ణ , ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధికార ప్రతినిధి బెవర సాయి సుధాకర్ , రాష్ట్ర టిడిపి బీసీ సెల్ కార్యదర్శి బూర కనకారావు , రాష్ట్ర టిడిపి నగరాల సాధికార సమితి సభ్యులు బంక సురేష్ , అజీజ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## సాయి మాస్టారు ఆకస్మిక మరణం ఆ కుటుంబానికి తీరనిలోటు-సుధ



**మైలవరం జూలై 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సాయి మాస్టారు ఆకస్మిక మరణం ఆ కుటుంబానికి తీరనిలోటు అని మదర్ థెరీసా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు కోయ సుధ అన్నారు. సామాన్య కుటుంబాలలో ఇలాంటి ఆకస్మిక సంఘటనలు తద్వారా ఎదురయ్యే పరిస్థితులు ఎవరు తీర్చలేనివని,తమ ట్రస్ట్ సభ్యురాలు రాజి కుటుంబంలో ఇలాంటి ఘటన జరగడం బాధాకరమని ఈ సమయంలో మనోధైర్యంతో కుటుంబాన్ని నిలబెట్టు కోవాలని ఆమె అన్నారు.వారి కుటుంబంలో ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా దాతల సహకారంతో రూ.25000 విలువగల చెక్ ను అందిచామన్నారు. సహృదయంతో మరికొంతమంది దాతలు ముందుకు రావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి ఎస్.విజయలక్ష్మి, కోశాధికారి డి.విజయలక్ష్మి సభ్యులు మాధవి,శ్వేత, నాగమణి,నాగలక్ష్మి,నాగమణి, కవిత, నాగజ్యోతి,అరుణ పాల్గొన్నారు.

## ప్రపంచం గర్వించదగ్గ గొప్ప శాస్త్రవేత్త అబ్దుల్‌కలామ్

- రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షేక్ ఆసిఫ్



**విజయవాడ పశ్చిమ జూలై 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రపంచం గర్వించదగ్గ గొప్ప శాస్త్రవేత్త భారతరత్న అబ్దుల్‌కలామ్ అని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ షేక్ ఆసిఫ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జి షేక్ ఆసిఫ్ అన్నారు. వించిపేటలోని షేక్ ఆసిఫ్ కార్యాలయంలో అబ్దుల్‌కలామ్ పదో వర్ధంతిని పురస్కరించుకొని నివాళి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్‌కలామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆసిఫ్ మాట్లాడుతూ కలామ్ బహుముఖ ప్రజ్ఞాశాలి అన్నారు. మిసైల్ మేన్ ఆఫ్ ఇండియాగా గణతికెక్కిన కలామ్ దేశంలో సాంకేతికరంగ అభ్యున్నతికి విశేషమైన సేవలందించారన్నారు. భారతీయ శాస్త్రసాంకేతిక రంగాల్లో ఆయన చూపించిన ప్రతిభ ప్రపంచంలో దేశ ప్రతిష్టను మరింతగా ఇనుమడింపజేసిందన్నారు. దేశాభ్యున్నతి కోసం పాటుపడ్డారని కొనియాడారు. మిసైల్ రంగం అభివృద్ధికి ఆయన ఎనలేని సేవలందించారిని పేర్కొన్నారు. అత్యంత సామాన్యమైన కుటుంబంలో పుట్టి నిరంతర శ్రమతో దేశంలోనే అత్యున్నతమైన అధ్యక్ష పీఠాన్ని అందుకున్నారని వివరించారు. అంతేకాకుండా దేశంలోని యువతను, విద్యార్థులను తన ప్రసంగాలతో నిరంతరం ప్రొత్సాహించారని ఆ క్రమంలోనే అశువులు భాసారని వివరించారు. ఆయన జీవితాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర మైనార్టీ సీనియర్ నాయకులు షేక్ బాజీ, షాహిద్, కర్రీ గౌరీ ,మురళి నాయక్, రెహమాన్ భాయ్, గిరి, రషీద్ , తదితర నాయకులు పాల్గొన్నారు.

## మిసైల్ మాన్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సభ



**కృత్తివెన్ను జూలై 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పల్లె పాలెం నందు భారత 11 వ రాష్ట్రపతి,క్షిపణి శాస్త్రవేత్త ,భారత రత్న డాక్టర్ అబ్దుల్ కలామ్ గారి వర్ధంతి ఘనంగా నిర్వహించారు.ముందుగా ఆయన చిత్ర పటానికి ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయుడు కొప్పినీడి సూర్య ప్రకాష్ పూలమాల వేసి నివాళులు జి గా కీర్తి గడించి ,రాష్ట్ర పతి స్థాయికి ఎదిగిన గొప్ప వ్యక్తి అని,అందుకే ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా భారత రత్న అవార్డు ఇచ్చి గౌరవించారు అని ఆయన అన్నారు.

## ఆదిత్య డిగ్రీ కళాశాలలో అబ్దుల్ కలామ్ వర్ధంతి



**కాకినాడ జూలై 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో భారతదేశ మాజీ రాష్ట్రపతి, భారతరత్న డా.ఎ.పి.జె అబ్దుల్ కలామ్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డా.బిఈవిఎల్ నాయుడు తెలిపారు.పరిశోధకులు,ఎందరికో స్ఫూర్తి ప్రదాత,పట్టుదలకు అకుంఠిత దీక్షకు,క్రమ శిక్షణకు,నిజాయితికి చిరునామ డా.ఎ.పి.జె అబ్దుల్ కలామ్ పరిశోధనలో ఖ్యాతి గడించి,భారత కీర్తి కిరీటాన్ని దిగంతాలకు వ్యాప్తి గావించిన మహనీయుడు,భారతరత్న ఎ.పి.జె.అబ్దుల్ కలామ్ 9వ వర్ధంతి సందర్భంగా ఎ.పి.జె అబ్దుల్ కలామ్ చిత్రపటానికి కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డా.నాయుడు పూలమాలను వేసి నమస్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరికో మార్గదర్శకమైన మిసైల్మేన్, భారతరత్న ఎ.పి.జె. అబ్దుల్ కలామ్ ఆత్మకథను విద్యార్థులందరు చదువుకోవాలని, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డవలప్ మెంట్ ఆర్గనైజేషన్, ఇస్రోలో సేవలు అందించి తదుపరి భారత రాష్ట్రపతి పదవి చేపట్టిన మహనీయులు కలాం అని అన్నారు.ఇండియా 2020 అనే తన పుస్తకంలో భారతదేశాన్ని ఒక అభివృద్ధిచెందిన దేశంగా మార్చడానికి తగు ప్రణాళికలు సూచించారని అన్నారు. విద్యార్థులు కలాంను స్మరించి, కలాం కలలుకన్న దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని అన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సి.సత్యనారాయణ, ఇన్చార్జి ఎన్.మూర్తి ఎస్.ఎస్.ఎస్ ప్రోగ్రాం అధికారులు తేజేశ్వరరావు , గౌరీ ప్రియ, విద్యార్థులు పాల్గొన్నారు.

## చెట్లను నాటడం పవిత్రమైన బాధ్యత



**అనంతపురం జూలై 27 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పవిత్రమైన బాధ్యతగా చెట్లను నాటడం చేపట్టాలని అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్. వి పేర్కొన్నారు. శనివారం అనంతపురం నగరంలోని రెండవ రోడ్డులో ఉన్న పొట్టి శ్రీరాములు నగర పాలకోన్నత పాఠశాలలో ఏజీఎస్ ఫౌండేషన్ చేపట్టిన ఉచిత చెట్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విస్తృతంగా మొక్కల పెంపకం కార్యక్రమం మొదలు పెట్టామన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188